నేడు
TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY
గురువారం | 30.10.2025 | సంపుటి : 3 | సంచిక :182 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



తొలి టీ20 వర్షార్పణం 08

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ
# కాంగ్రెస్ మైనార్టీ పాచిక

- మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- 31న ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధం
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం
- సిఎం రేవంత్‌తో అజారుద్దీన్ భేటీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పాచిక పన్నుతోంది. ఇంతకాలం కేబినేట్‌లో మైనార్టీలకు చోటుదక్కలేదు. తాజాగా మహమ్మద్ అజహరుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. శుక్రవారం తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం జరగనుంది. అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.ఈ మేరకు రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.



హైదరాబాద్, అక్టోబర్ 29 : ఇదిలావుంటే తాజాగా అజారుద్దీన్‌ను సిఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకోవడం, వార్తలకు బలం చేకూరింది. తనకు మంత్రి పదవి ఇవ్వాలన్న నిర్ణయంపై ధన్యవాదాలు తెలిపినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గ విస్తరణపై గత -మిగతా 2 లో..



## తెలంగాణలో కుండపోత వర్షాలు..
# ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్

మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వరంగల్- ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. ప్రధాన రహదారిపై వర్షం నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆ రహదారిని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 29 : వరంగల్‌లోని శివనగర్, మైసయ్య నగర్, ఎన్‌ఎన్ నగర్, లక్ష్మీగణపతి, విశ్వనాథ్ కాలనీ, కాశీబుగ్గ, వివేకానంద కాలనీ, స్టేషన్‌రోడ్, బట్టల బజార్‌లో రోడ్లపైకి వరదనీరు చేరింది. వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు బారీగా నిలిచింది. శివనగర్‌లో రహదారిపై వరద నీటితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వరంగల్ బస్టాండ్ -మిగతా 2 లో..

## ప్రాణ, ఆస్థి నష్టం లేకుండా
# జాగ్రత్తలు తీసుకోవాలి

ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలి

అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



03



08

## అమెజాన్ లేఆఫ్స్..
భారత్‌లో 1000 మందిపై ఎఫెక్ట్



08

## లాభాల్లో ముగిసిన సూచీలు



## మళ్లీ పెరిగిన బంగారం ధరలు 04



## ఒక్కో ఉద్యోగానికి రూ.35 లక్షలు
### వెలుగులోకి భారీ జాబ్ స్కామ్..

తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాల నియా మకాల్లో భారీ కుంభకోణం బయటపడింది. రాష్ట్ర ము న్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25 -35లక్షల చొప్పున ముడు పులు తీసుకున్న ట్లు తెలిసిం ది. ఓ మనీలాండరింగ్ కేసు కు సంబంధించి ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ జాబ్ స్కామ్‌ను గుర్తించిన అధికారులు.. దీనిపై తమిళనాడు పోలీసు విభాగానికి తాజాగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 10

## జూబ్లీహిల్స్
# నీ అయ్యా జాగీరా?

నవీన్ యాదవ్ బెదిరింపులు సహించేది లేదు : బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ హెచ్చరిక

నేను ఓపెన్‌గా అడుగుతున్నా.. జూబ్లీహిల్స్ నీ అయ్యా జాగీరా..? పోలీసులు ఎక్కడ పోయారు. సుమోటో కేసులు ఎందుకు నమోదు చేయడం లేదు. నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. పోలీసులు నవీన్ యాదవ్‌కు సపోర్టు చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు.ఎన్నికలకు ముందు, అసెంబ్లీకి పోకముందే ఇంత రౌడీయిజం చేస్తున్నారు. వీళ్ల పహిల్వాన్‌లు బస్తీల్లోకి వచ్చి అరాచకం చేస్తారు. ఇక్కడ సీసీ కెమెరాలు పెట్టండి.. గుండాయిజం పెరుగుతుందని ఓ మహిళ ఆందోళన వ్యక్తం చేసింది. కేసీఆర్ అధికారంలో నుంచి పోయినప్పటి నుంచి బస్తీల్లో గుండాయిజం పెరిగిందని ఆమె చెప్పారు.



02



04

## సొంత కారు లేకపోతే పిల్లనివ్వరు
డీకే శివకుమార్ వ్యాఖ్యలు



# ఛత్తీస్‌గఢ్‌లో 51 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, అక్టోబర్ 29 : : మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 9 మంది మహిళా నక్సల్స్ ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరిపై రూ.66 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. వీరందరూ మావోయిస్టు పార్టీ కంపెనీ నంబర్ 1, 2 ,5 సభ్యులని తెలిపారు. మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు.

# మోదీ అంటే చాలా గౌరవం..
## అతి త్వరలో ట్రేడ్ డీల్: ట్రంప్

భారత ప్రధాని నరేంద్రమోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. మోదీ అంటే తనకు చాలా గౌరవమని అన్నారు. భారత్‌తో అతి త్వరలోనే వాణిజ్య ఒప్పందం జరగనున్నట్లు ట్రంప్ వెల్లడించారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న ట్రంప్.. ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కార్పొరేషన్ (అపెక్) సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్-అమెరికా సంబంధాల గురించి ప్రస్తావించారు. భారత్-పాక్ ఉద్రిక్తతలను గుర్తుచేస్తూ అణ్వాయుధ సామర్థ్యం ఉన్న రెండు దేశాల మధ్య యుద్ధాన్ని తాను ఆపానంటూ మరోసారి చెప్పారు.

న్యూఢిల్లీ : ఆ ఉద్రిక్తతల సమయంలో టారిఫ్‌లతో బెదిరించానంటూనే మోదీపై ప్రశంసలు కురిపించడం గమనార్హం. "భారత ప్రధాని నరేంద్రమోదీ అంటే నాకు చాలా గౌరవం. ఆయన మంచి వ్యక్తి. ఆయన లాంటి తండ్రి ఉండాలని చాలామంది కోరుకుం టారు. అయితే ఆయన సంక్లిష్టమైన వ్యక్తి. బలమైన నేత. పాక్‌తో యుద్ధం కొనసాగిస్తామని అన్నారు. అలా జరిగితే భారత్‌పై టారిఫ్‌లు భారీగా పెంచుతానని హెచ్చరించా. అటు పాక్‌ను కూ డా బెదిరించా. దీంతో వారు యుద్ధాన్ని ఆపారు" అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్‌తో అతిత్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరనున్నట్లు వెల్లడించారు. భారత్-అమెరికా మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతోన్న వాణిజ్య చర్చలు త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ ట్రేడ్ డీల్‌తో భారత్‌పై ట్రంప్ టారిఫ్‌లు భారీగా దిగి రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 50శాతం ఉన్న టారిఫ్‌లు.. 15-16 శాతానికి తగ్గే అవకాశం ఉందని ఇటీవల పలు కథనాలు వెల్లడించాయి. అంతేగాక, రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించుకునేందుకు భారత్ అంగీకరించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి.



## రఫేల్ యుద్ధ విమానంలో
# విహరించిన రాష్ట్రపతి

రాష్ట్రపతి ముర్ముతో రఫేల్ రాణి శివాంగీ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 29 : రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానం లో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. హరియా ణాలోని అంబాలా వైమానిక స్థావ రంలో దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము భారత -మిగతా 2 లో..





# రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

(మొదటిపేజీ తరువాయి)

విమానానికి దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ముందుగా భద్రతా దళాల నుంచి సైనిక వందనం స్వీకరించారు. ఫ్లైయింగ్ సూట్ ధరించిన రాష్ట్రపతి ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. ఇందులో యుద్ధ విమాన పైలట్ శివాంగి సింగ్‌తో దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆమెని బంధించినట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్‌కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలట్‌ను బంధించామని పాక్ అబద్ధాలు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగి సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇప్పుడు ఆమెతో రాష్ట్రపతి ముర్ము ఫొటో దిగడంతో శివాంగి మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె కోసం నెటిజన్లు శోధిస్తున్నారు. సింగ్ స్వస్థలం వారణాసి. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం లో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌సీసీలో చేరారు. అప్పై 2016లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనం నుంచి పక్షిలా ఆకాశంలో ఎగరాలని కలలు కన్న ఆమె.. ఎప్పటికైనా పైలట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ యుద్ధ విమాన పైలట్లుగా నియమితులైన మోహనా సింగ్, భావనా కాంత్, అవనీ చతుర్వేది స్ఫూర్తితో పైలట్‌గా శిక్షణ తీసుకున్నారు. 2017లో రెండో దశ యుద్ధ విమాన పైలట్లలో ఒకరిగా ఎంపికైన శివాంగి.. మిగ్-21 బైసన్ యుద్ధ విమానాలు నడపడంలో ప్రావీణ్యం సాధించారు. మిగ్ ఫైటర్ జెట్లు నడిపిన అనుభవంతోనే 2020లో దేశంలోనే అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం దక్కించుకున్నారు. అప్పటి నుంచి అంబాలా ఎయిర్‌బేస్‌లోని 'గోల్డెన్ యారోస్' స్క్వాడ్రన్ బృందంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2022లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 'భవిష్యత్తు కోసం భారత వైమానిక దళం రూపాంతరం చెందుతోంది' అనే థీమ్‌తో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శకటాన్ని ప్రదర్శించింది. ఈ శకటంలో రఫేల్ +ట్రైనర్ జెట్ యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శకటంపై శివాంగి సింగ్ సెల్యూట్ చేస్తూ కనిపించారు. గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న రెండో పైలట్‌గా ఘనత సాధించారు. ఆ సమయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా 'రఫేల్ రాణి' అంటూ చేసిన పోస్ట్ ఆకట్టుకుంది.

## రహదారి నిర్మాణాల వద్ద క్యూఆర్ కోడ్

- పారదర్శకతకు పెద్దపీట వేసే యోచన
- నిర్మాణ వ్యవహారాలపై ప్రజలు తెలుసుకునే అవకాశం
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 29 :** దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్‌లను ప్రవేశపెట్టాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. దీంతో రోడ్ల న ఇర్మాణానికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడానికి ఇవి ఉపయోగ పడతాయన్నారు. పౌరులు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ ప్రాజెక్టు కోసం పని చేసిన కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, నిర్మాణానికి మంజూరుచేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ వంటి కీలక వివరాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. 'స్మార్ట్ రోడ్ల భద్రత' అనే అంశంపై దిల్లీలో నిర్వహించిన ఓ సమావేశంలో ప్రసంగించిన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. రోడ్లు బాగా లేకపోతే అందరూ తననే నిందిస్తారని.. మొత్తం వ్యవస్థ చేసిన తప్పునకు తాను మాత్రమే ఎందుకు తిట్లు తినాలని, సోషల్ మీడియాలో ఆరోపణలపై ఎందుకు స్పందించాలని నితిన్ గడ్కరీ చమత్కరించారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారమంతా ప్రజలకు బహిర్గతం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అప్పుడే రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడే అధికారులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రోడ్లపై క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం వల్ల దానిని మంజూరు చేసిన మంత్రి ఎవరు, దాని నిర్మాణం కోసం పనిచేసిన కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు వారి ఫోన్ నంబర్లు, ఫొటోతో సహా అన్ని వివరాలు ప్రజలకు, విలేకరులకు అందుబాటులో ఉంటాయి. ఆయా రోడ్లపై ఏదైనా సమస్య వస్తే వారు నేరుగా ఆ అధికారులనే ప్రశ్నించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇది ప్రధానంగా ప్రజల్లో బాధ్యతను పెంచుతుందని, వివరాలు తెలుసుకునే వీలుంటుందని అన్నారు.

## కొన్ని దేశాలపై అతిగా ఆధారపడటం తగ్గించుకోవాలి : పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ :** స్థిరమైన సరఫరా వ్యవస్థ, కీలక సాంకేతికతలపై నియంత్రణ, కొన్ని దేశాలపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించుకోవడం చాలా ముఖ్యమని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. 'స్వదేశీ' పిలుపు.. కేవలం భారత్‌లో తయారీ గురించి కాదని, దేశ దీర్ఘకాలిక వృద్ధికి, సార్వభౌమత్వానికి ఇది దోహదపడుతుందన్నారు. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈమేరకు మాట్లాడారు. భారత టెక్ స్టార్టప్‌లు ప్రపంచవ్యాప్తంగా ఆదరణను పొందుతున్నాయని తెలిపారు. "సాంకేతిక పరిజ్ఞానం, ఆయుధాలు, ఇంధన వనరుల విషయంలో విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం దేశాభివృద్ధికి కీలకం. స్వీయ సాంకేతికత, స్థిరమైన సరఫరా వ్యవస్థ వంటివి ఎంత ముఖ్యమో.. ఈ దశాబ్దంలో కొవిడ్ మొదలు అనేక పరిణామాలు చాటిచెప్పాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచానికి బ్యాక్ ఆఫీస్ లేదా సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌గా నిలవడం నుంచి ప్రపంచ ఆవిష్కరణల ఇంజిన్‌గా మారాలని భారత్ నిర్ణయించింది" అని పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. చమురు, సెమీకండక్టర్లు, అరుదైన ఖనిజాల విషయంలో విదేశాలపై భారత్ ఆధారపడుతున్న నేపథ్యంలో కేంద్రమంత్రి గోయల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెమీకండక్టర్ల ఎగుమతుల్లో తైవాన్ అగ్రగామిగా ఉంది. ప్రపంచ అవసరాల్లో 90 శాతం ఈ దేశమే సరఫరా చేస్తుంది. ఈ రంగంలో విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 10 సెమీకండక్టర్ ప్రాజెక్టులపై దాదాపు రూ. 1.6 లక్షల కోట్లమేర పెట్టుబడులు పెడుతోంది. అదేవిధంగా 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0'ని కూడా ప్రకటించింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ మైనార్టీ పాచిక

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక పక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే బిసి రిజర్వేషన్లపై కసరత్తు జరుగుతున్న వేళ కేబినేట్‌లో బిసిల కోటాను పెంచాలని డిమాండ్ వచ్చింది. దీనిని కాంగ్రెస్ పట్టించుకున్నట్లు లేదు. మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమా ణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉ ఒడటంతో కాంగ్రెష్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో.. త్వరలో కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల్లో అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగు తున్నట్టు తెలుస్తోంది. దీంతో బిసి సామాజిక వర్గాలు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బీర్ల అయిలయ్యలు ఎప్పటి నుంచో మంత్రిపదవికి డిమాండ్ చేస్తున్నారు. అజారుద్దీన్ రాకతో ఇప్పుడు హైదరాబాద్‌కు చోటు దక్కినట్లు కానుంది.



## మూడు జిల్లాల్లో నేడు స్కూళ్లకు సెలవు

### సిద్దిపేట, హన్మకొండ, ములుగులకు వర్తింపు

**హైదరాబాద్, అక్టోబర్ 29 :** మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా సిద్దిపేట, హన్మకొండ, ములుగు జిల్లాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నదులు, వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. రహదారులపై నీరు చేరి రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు సంయుక్తంగా సమీక్ష నిర్వహించి, వర్షపాతం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం సిద్దిపేట, హన్మకొండ, ములుగు జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ నిర్ణయానికి లోబడుతాయి. అలాగే వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని అధికారులు ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావం కొనసాగుతున్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. తక్కువ ఎత్తు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. హన్మకొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం, గోవిందరావుపేట, తాడ్వాయి, వెంకటాపురం మండలాల్లో వాగులు పొంగి రహదారులు తెగిపోయాయి. కొందరు గ్రామాలు రోడ్డు మార్గం ద్వారా సంబంధాలు కోల్పోయాయి. స్థానిక ఎన్‌డీఆర్ఎఫ్, సిబ్బంది అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారు. అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి, పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేయాలనే ఉత్సాహం ఎవరిలోనూ లేదు

- యూసుఫ్‌గూడలో సీఎం సన్మాన సభే ఇందుకు నిదర్శనం
- మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్





**హైదరాబాద్:** 'రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు..నిన్న మొన్నటి వరకు గీతక్క, సీతక్క, సురేఖక్క సంతోషంగా ఉన్నారని భావించా.. సురేఖక్క సంతోషంగా లేరనే విషయం ఇటీవల వెల్లడైంది.. కాంగ్రెస్‌కు ఓటేయాలనే ఉత్సాహం ఎవరిలోనూ లేదు.. ఇందుకు యూసుఫ్‌గూడలో సినీ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం సన్మాన సభే నిదర్శన'మని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అక్కడ మూడోవంతు కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయన్నారు. తెలంగాణభవన్ లో బుధవారం నిర్వహించిన మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'రెండేళ్ల నుంచి రాష్ట్రంలో ఆహ నా పెళ్లంట సినిమా నడుస్తోంది. ఆరు గ్యారంటీల అమలు పరిస్థితి కోడిని చూపించి అదే చికెన్ బిర్యాని అనుకోవాలని అన్నట్లు ఉంది. రైతులు పండించిన ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. మహిళలకు నెలకు రూ.2,500, ఆడబిడ్డలకు వివాహ సమయంలో తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసింది. ఓట్లు కొనుగోలు చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ఓటుకు రూ.2 వేలు ఇస్తే.. తీసుకుని ప్రభుత్వం మహిళలకు బాకీపడిన మిగతా రూ.58వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించండి. మరో మార్గం లేకపోవటంతో 12 వేల వరకు దొంగ ఓట్లు వేయించే ప్రయత్నాల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నారు. గెలిచిన 64 మంది ఎమ్మెల్యేలు పెళ్లిళ్లు, పేరంటాలు, చావులకు వెళ్లడం తప్ప చేస్తున్న పనులేవీ లేవు. ఒక ఎమ్మెల్యే నిధుల కోసం ఏకంగా ప్రపంచ బ్యాంకుకే ఉత్తరం రాశారు. రాష్ట్రంలో మున్నూరు కాపులకు పదవులతో పాటు సముచిత గౌరవం ఇచ్చారు కేసీఆర్. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ కాంగ్రెస్ మోసం చేసింది'అని అన్నారు. మున్నూరుకాపులు, బీసీలకు కాంగ్రెస్ తీరని ద్రోహం చేసిందని రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. జూబ్లీహిల్స్‌లో ముస్లింల తర్వాత అత్యధికులు కాపులు, బీసీలు ఉన్నారని, భారత రాష్ట్ర సమితి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. సమావేశంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మున్నూరు కాపు సంఘం నేతలు పాల్గొన్నారు.

## విదేశీ విద్య ఉపకార వేతన బకాయిలు రూ.303 కోట్లు విడుదల

### ఆర్థికశాఖకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశాలు

**హైదరాబాద్:** విదేశీవిద్య ఉపకార వేతనాల పద్దు కింద పెండింగ్ బకాయిలు రూ.303 కోట్లు తక్షణం విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలన్నీ ఒకేసారి విడుదల చేయాలని సూచించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఆయన ఆర్థికశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొత్తం 2,288 మంది విద్యార్థులకు విదేశీ విద్య ఉపకార వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు ఆయనకు వివరించారు. భట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలం నుంచి ఈ ఉపకార వేతనాలకు నిధులు విడుదల కాకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న వారి తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఓవైపు ఉపకార వేతనాలు అందక.. మరోవైపు అమెరికా, యూకే వంటి దేశాల్లో అక్కడి కొత్త ఆంక్షలతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీవ్రమైందని.. ఆయా దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేదని, అక్కడున్నవారిపై రోజురోజుకూ ఆర్థిక భారం పెరిగిపోతుందని వివరించారు. మరోవైపు బ్యాంకుల్లో తీసుకున్న విద్యారుణ భారం పెరుగుతున్నందున ఈ సమస్యను ప్రాధాన్య అంశంగా భావించి బకాయిలన్నీ ఒకేసారి విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: పొంగులేటి

### జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్:** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందివ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో పలువురు నాయకులు, కార్యకర్తలు పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గత ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చగా.. పేదలకు తాము ఇచ్చిన హామీలను తల తాకట్టు పెట్టైనా అమలు చేస్తున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే పీజేఆర్ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారత రాష్ట్ర సమితి ఇతర పార్టీల నుంచి చాపల కృష్ణ, ఆనందరాజు, బాసాటి కృష్ణల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, బాలు నాయక్, వేముల వీరేశం, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేషన్ ఛైర్మన్లు రాంరెడ్డి, రమేశ్‌రెడ్డి, కొత్వాల్, జైపాల్, సీఎన్ రెడ్డి, భవాని శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

## తెలంగాణలో కుండపోత వర్షాలు..

(మొదటిపేజీ తరువాయి)

చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాల దృష్ట్యా హనుకొండ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సహాయక చర్యల కోసం 79819 75495 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వరంగల్ జిల్లా కల్లెడలో అత్యధికంగా 34 సెం.మీ వర్షపాతం నమోదైంది.

### ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్

హనుమకొండ, వరంగల్, మహబూబ్ బాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఖమ్మం- మహబూబాబాద్ జిల్లాల మధ్య వాల్యా తండా సమీపంలోని వంతెనకు ఆనుకుని ఆకేరు వాగు ప్రవహిస్తోంది. దీంతో ఇవాళ సాయంత్రం నుంచి రెండు జిల్లాల మధ్య అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

## జూబ్లీహిల్స్ నీ అయ్యా జాగీరా..?

(మొదటిపేజీ తరువాయి)

మరి ముఖ్యంగా మహిళలు అభద్రతాభావంతో ఉన్నారు. గుండాగిరి, దౌర్జన్యం పోవాలంటే కారు గుర్తుకు ఓటేయాలి అని ఆర్ఎస్పీ పిలుపునిచ్చారు.మాజీ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ ఓ వ్యక్తికి ఫోన్ చేసి మీ ఇంట్లో గంజాయి పెట్టి ఉల్టా కేసులు నమోదు చేయిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇలా ధమ్కీలు ఇవ్వడం ఎంత వరకు కరెక్ట్. వీళ్లందరు రేపు మన ఇండ్లలో తిండి కాదు పెట్టేది గంజాయి. కేసీఆర్ అందరికి తిండి పెడితే.. వీళ్లు అందరి ఇంట్లో గంజాయి పెట్టి కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రజలంతా నవంబర్ 11వ తేదీన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు వేచి చూస్తున్నారు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## అభివృద్ధిపై చర్చకు సిద్ధం: మంత్రి పొన్నం

**హైదరాబాద్ :** పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన అభివృద్ధి, రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉపయోగం ఉంటుంది కానీ మూలనపడ్డ కారు(భారత రాష్ట్ర సమితి)కు ఓటేస్తే ముందుకు పోలేమని జూబ్లీహిల్స్ ప్రజలు గమనించాలని కోరారు. మంత్రి బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడారు. 'జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య కాదు. కాంగ్రెస్ అభివృద్ధికి, భారత రాష్ట్ర సమితి అబద్ధాలకు మధ్య జరగనుంది. భారత రాష్ట్ర సమితి నేతలు వారు చేసిన అభివృద్ధి గురించి చెప్పకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలి. ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరుతున్నా'అని పొన్నం పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కసిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## నేడు కళాశాలల బంద్ : ఎస్ఎఫ్ఐ

**హైదరాబాద్:** ఏళ్లకొద్దీ పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఇతర వృత్తి విద్యా కళాశాలలతోపాటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌కు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. ప్రభుత్వం బోధనా రుసుములను విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, దానివల్ల అంతిమంగా పేద విద్యార్థులే నష్టపోతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్, కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ ప్రకటించి సహకరించాలని వారు కోరారు. మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో అధ్యాపకులకు కళాశాలల యాజమాన్యాలు వేతనాలు చెల్లించడం లేదని దీనిపై శనివారం సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామని టీఎస్‌టీసీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలి
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



**హైదరాబాద్, అక్టోబర్ 29 :** మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నందున.. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో వాయుగుండం ప్రభావంపై సీఎం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని.. దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసినందున ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాటు.. హైదరాబాద్, ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గోల్కొండ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దారి మళ్లించినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని... కలెక్టర్లు ఆయా బృందాలకు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టా న్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని.. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతా ల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధిం చాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారి కేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే వినతుల్న, ఫిర్యాదులపై జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాప క శాఖ సిబ్బంది వెంటనే స్పందిం చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## వరంగల్- ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరద

**వరంగల్, అక్టోబర్ 29 :** మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వరంగల్– ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. ప్రధాన రహదారిపై వర్షం నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దీంతో ఆ రహదారిని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. వరంగల్‌లోని శివనగర్, మైసయ్య నగర్, ఎన్ఎన్ నగర్, లక్ష్మీగణపతి, విశ్వనాథ్ కాలనీ, కాశీబుగ్గ, వివేకానంద కాలనీ, స్టేషన్‌రోడ్, బట్టల బజార్‌లో రోడ్లపైకి వరదనీరు చేరింది. వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు బారీగా నిలిచింది. శివనగర్‌లో రహదారిపై వరద నీటితో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వరంగల్ బస్టాండ్ చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా హనుకొండ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సహాయక చర్యల కోసం 79819 75495 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వరంగల్ జిల్లా కల్లెడలో అత్యధికంగా 34 సెం.మీ వర్షపాతం నమోదైంది. హనుమకొండ, వరంగల్, మహబూబ్ బాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిరిసిల జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఖమ్మం–మహబూబాబాద్ జిల్లాల మధ్య నిలిచిన రాకపోకలు. ఖమ్మం–మహబూబాబాద్ జిల్లాల మధ్య వాల్యాతండా సమీపంలోని వంతెనకు ఆనుకుని ఆకేరు వాగు ప్రవహిస్తోంది. దీంతో ఇవాళ సాయంత్రం నుంచి రెండు జిల్లాల మధ్య అధికారులు రాకపోకలు నిలిపివేశారు. 'మొంథా' తుపాను వాయుగుండంగా బలహీనపడింది. గడచిన 6 గంటలుగా ఇది 12 కి.మీ వేగంతో కదులుతోంది. తెలంగాణ భూభాగంపై దీని ప్రభావం కొనసాగుతోంది. భద్రాచలానికి 50 కి.మీ, ఖమ్మం జిల్లాకు 110 కి.మీ దూరంలో ఇది కేంద్రీకృతమైంది. ఒడిశాలోని మల్కన్‌గిరికి 130 కి.మీ దూరంలో ఉంది. ఉత్తర వాయవ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడనుంది. దీని కారణంగా రాగల 12 గంటల్లో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు పడనున్నాయి. తెలంగాణలో ఒకట్రెండు ప్రాంతాలకు ఆకస్మిక వరద హెచ్చరికలను విశాఖ వాతావరణ కేంద్రం జారీ చేసింది. పలు ప్రాంతాల్లో 35–45 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.



## డోర్నకల్‌లో పట్టాలపై నిలిచిన నీరు

### పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

**మహబూబాబాద్, అక్టోబర్ 29 :** మొంథా తుపాన్ కారణంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ వర్షం కురుస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రైలు పట్టాలపైకి వరద నీరు చేరింది. డోర్నకల్ స్టేషన్‌లో వరద నీరు పట్టాలను ముంచెత్తింది. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను భద్రతా కారణాలరీత్యా రైల్వే అధికారులు నిలిపివేశారు.



## ఏన్కూర్ బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన డిసిఎం

**ఖమ్మం, అక్టోబర్ 29 :** తుపాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలో గల అంజనాజపురం నిమ్మవాగు బ్రిడ్జి పై నుండి నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాగా, పల్లిపాడు –ఏన్కూర్ మార్గ మధ్యలో ఉన్న బ్రిడ్జిపై పొంగిపొర్లుతున్న నీటి ప్రవాహం నుంచి డ్రైవర్ డీసీఎం వ్యాను దాటించే ప్రయత్నం చేశాడు. అయితే బ్రిడ్జి మధ్యలోకి రాగానే వాహనం ఆగిపోవడంతో స్థానికులు డీసీఎంను వదిలి ఒడ్డుకు రావాలని ఎంత చెప్పిన వినలేదు. దీంతో డీసీఎం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ నీటిలో గల్లంతు అయ్యాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మూసీనదికి వరదపోటు

### ఏడు గేట్లు ఎత్తి నీటి విడుదల

**నల్లగొండ, అక్టోబర్ 29 :** నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ నదికి వరద పోటెత్తింది. ఎగువన కురు–స్తున్న భారీ వర్షాలతో పాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి మూసీకి భారీగా వరద నీరు వచ్చి చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు ఏడు గేట్లను 4 అడుగుల మేర ఎత్తి దిగువకు 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు 3, 4, 5, 6, 8, 10, 12 క్రస్ట్ గేట్లను 4 అడుగుల మేర ఎత్తినట్లు అధికారులు తెలిపారు. గేట్లను ఎత్తడంతో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జూలూరు– రుద్రవెల్లిలో లెవల్ బ్రిడ్జి వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పోచంపల్లి– బీబీనగర్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు బీబీనగర్, భువనగిరికి వెళ్లేందుకు పెద్ద రావులపల్లి నుండి చుట్టూ తిరిగి వెళుతున్నారు. మూసీ ఉధృతితో అధికారులు ఇరు వైపులా భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. అధికారులు పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మూసీ పరివాహక ప్రాంతాల్లో సంచరించవద్దని మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి సూచించారు.

# స్పామ్ కాల్స్‌కు ఇక చెక్

- మోసపూరిత కాల్స్ సులువుగా గుర్తింపు
- ట్రాయ్ ఆధ్వర్యంలో ట్రూకాలర్ సేవలు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 29 :** భారత టెలికమ్యూనికేషన్ రంగంలో ఒక కీలక మార్పు రాబోతోంది. ఇకపై కాల్ వచ్చే సమయంలో నంబర్‌తో పాటు కాలర్ పేరు కూడా కచ్చితంగా కనిపించేలా ట్రాయ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పామ్ కాల్స్‌ను అరికట్టే దిశగా కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్ సేవను డీఫాల్ట్ ఫీచర్‌గా ప్రవేశ పెట్టాలని ట్రాయ్ అంగీకరించింది. అక్టోబర్ 28న విడుదలైన ఈ నిర్ణయం ప్రకారం ఇకపై కాల్ చేసిన వారి పేరు నంబర్‌తో పాటు రిసీవ్ చేసుకొనే వ్యక్తికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సేవ అమలుకు సంబంధించిన చర్చలు చాలా కాలంగా కొనసాగుతున్నాయి. సేవ సాధ్యాసాధ్యాలపై సిఫార్సులు ఇవ్వాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం 2022 మార్చిలో ట్రాయ్‌ను సంప్రదించింది. ఆ తర్వాత 2024 ఫిబ్రవరిలో ట్రాయ్ తన తొలి సిఫార్సులను సమర్పించగా.. 2025 సెప్టెంబరులో ఆని పునఃపరిశీలన కోరింది. ఈ నేపథ్యంలో ట్రాయ్ తాజాగా ఇచ్చిన సమాధానంలో ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకుని కొన్ని కీలక మార్పులతో తన మునుపటి సిఫార్సులను పునరుద్ధరించింది. ఈ సేవ ప్రధానంగా మోసపూరిత, స్పామ్ కాల్స్‌ను అరికట్టడమే లక్ష్యంగా దశలవారీగా ప్రవేశపెట్టబడుతుంది. ఇది అన్ని వినియోగదారులకూ డీఫాల్ట్‌గా యాక్టివ్‌గా ఉంటుంది. కానీ, అవసరమైతే ఆప్షనల్‌గా డిసేబుల్ చేసుకునే అవకాశం ఉంటుంది. వినియోగదారుల పేర్లు ఐజఅ ధృవీకరించిన వివరాల ఆధారంగా చూపిస్తాయి. లైసెన్సింగ్ నియమాల్లో కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ నిర్వచనాన్ని విస్తరించి.. కాలింగ్ నేమ్ ను కూడా చేర్చనున్నారు. గోప్యత రక్షణలో భాగంగా.. అఐఎఖీ ఎంచుకున్న వినియోగదారుల పేర్లు మాత్రం ప్రదర్శించబడవు. వ్యాపార వినియోగదారులు తమ ట్రేడ్ నేమ్ లేదా ట్రేడ్‌మార్క్‌ను కాలర్ ఐడెంటిటీగా చూపించుకునే వీలు ఉంటుంది. కానీ, అది ప్రభుత్వ ధృవీకరణ పక్రియకు లోబడి ఉంటుంది. అలాగే కొత్త మొబైల్ పరికరాల్లో ఫీచర్ తప్పనిసరిగా ఉండేలా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తో సమన్వయం చేయాలని ట్రాయ్ ప్రకటించింది. ఈ సేవను అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం మార్గదర్శకాలకు అనుగుణంగా సప్లిమెంటరీ సేవగా వర్గీకరించారు. ట్రాయ్ తాజా నిర్ణయం మేరకు టెలికాం ఆపరేటర్లకు ఒక వారంలో కనీసం ఒక సర్కిల్‌లో సేవ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత 60 రోజుల పైలట్ దశ పూర్తి చేసిన అనంతరం దేశవ్యాప్త రోల్‌అవుట్ జరగనుంది. ఈ కొత్త మార్పు ద్వారా కాల్ ట్రాన్స్‌పరెన్సీ పెరగడం, స్పామ్ లేదా మోసపూరిత కాల్స్‌ను సమర్థవంతంగా అరికట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## అమరవీరుల సంస్మరణలో భాగంగా సైకిల్ ర్యాలీ

**వరంగల్, అక్టోబర్ 29 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌తో పాటు చాహత్ బాజ్ పాయి, ఎన్‌డీపీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్ పచ్చా జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుంచి అంబేడ్కర్ సెంటర్, ఆదాలత్ సెంటర్, హనుమకొండ కలెక్టర్ కార్యాలయం నుంచి నక్కలగుట్ట మీదుగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. పోలీస్ కమిషనర్ సైక్లింగ్ రైడర్లతో కలిసి పోలీస్ అమర వీరులకు జోహర్లు అంటూ నినాదాలు చేస్తూ వారిని ఉత్సహరిచారు. అనంతరం ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సైకిల్ రైడర్లకు పోలీసు అధికారులు సర్టిఫికేట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, పోలీసులు ఉత్సహంగా పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్స్ జీసీసీ..

### పాలనపై నమ్మకానికి ప్రతీక : భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** నగరంలో అంతర్జాతీయ ఫుడ్ దిగ్గజం మెక్‌డొనాల్డ్స్ జీసీసీ (గ్లోబల్ కేపేబిలిటీ సెంటర్) ఏర్పాటు అనేది తెలంగాణ ప్రతిభపై విశ్వాసం, పాలనపై నమ్మకానికి ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జీసీసీలకు రాజధానిగా హైదరాబాద్ నిలిచిందన్నారు. 1.56 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్‌ను ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. మెక్‌డొనాల్డ్స్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన అతి పెద్ద కార్యాలయం ఇదే. మాజీ ప్రధాని నెహ్రూ మొదలుకొని పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ వంటి మహా నేతలు దూరదృష్టితో చేపట్టిన సంస్కరణల వల్ల హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా ఎదిగిందని భట్టి తెలిపారు. మినార్లు, సరస్సులతో అలరారే చారిత్రక నగరమైన హైదరాబాద్.. డేటా, డిజైన్ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా ఎదిగిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో అనువైన వాతావరణం, మౌలిక సదుపాయాల లభ్యత, నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉన్నాయని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నగరంలో కేవలం టెక్నాలజీకి సంబంధించిన సంస్థలే కాకుండా.. అన్ని రంగాలకు చెందిన కంపెనీలు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. ఆతిథ్య రంగంలో దిగ్గజ సంస్థ 'మారియట్' తన మొదటి జీసీసీని ప్రారంభించేందుకు హైదరాబాద్‌ను ఎంచుకుందన్నారు. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనకు తమ ప్రభుత్వం 'మెక్‌డొనాల్డ్స్' వంటి అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేసేందుకు ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.

## రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదు

### అమిత్ షా కీలక వ్యాఖ్యలు



**పట్నా:** రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని వ్యాఖ్యానించారు. బిహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఆర్జేడీపై ఆయన వ్యంగ్యా స్త్రాలు గుప్పించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమా రుడు తేజస్వీయాదవ్‌ను ముఖ్యమంత్రి ని చేయాలనుకుంటున్నారని, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని పీఎంను చేయాలనుకుంటున్నారని అమిత్ షా విమర్శించారు. కానీ ఆ రెండు స్థానాలు ఖాళీగా లేవంటూ మహాగఠ్‌బంధన్ పార్టీలను ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి.. రాష్ట్ర ప్రతిష్ఠను పెంచారని ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్‌షా వ్యాఖ్యానించారు. అలాగే పహల్గాం దాడి గురించి ప్రస్తావించారు. "ఆ ఉగ్రదాడి జరిగిన వెంటనే మోదీ ఆపరేషన్ సిందూర్‌కు ఆదేశాలు ఇచ్చారు" అని గుర్తుచేశారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఎన్డీయే, ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ అని ఇప్పటికే ప్రకటన రాగా.. ఎన్డీయే ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం స్పష్టత లేదు. దానిపైనే విపక్షాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. దాంతో తాము నీతీశ్ నాయకత్వంలో బిహార్ ఎన్నికలకు వెళ్తామని ఇటీవల మోదీ ప్రకటించారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని తాజాగా అమిత్ షా స్పష్టంచేయడంతో ఎన్డీయే సీఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై ఉన్న సందిగ్ధత వీడిపోయింది.

## రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్కులు

**హైదరాబాద్, అక్టోబర్ 29 :** తీరం దాటిన మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. తీర ప్రాంతాల జిల్లాలో విధ్వంసం సృష్టించిన మొంథా.. మిగతా జిల్లాల్లోనూ తీవ్ర పంట నష్టాన్ని మిగిల్చింది.. ఇక, తుఫాన్ ప్రభావంతో.. ఈస్ట్ కోస్ట్, సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో పెద్ద సంఖ్యలో రైళ్లను పూర్తిగా రద్దు చేయాల్సిన పరిస్థితి.. కొన్ని రైళ్లను దారి మళ్లించగా.. కోస్తా ప్రాంతాలు.. విజయవాడ మీదుగా నడవాల్సిన చాలా రైళ్లను రద్దు చేశారు.. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాని రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేసింది రైల్వే శాఖ.



## శ్రీశైలం రహదారిలో కోతకు గురైన రోడ్డు

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 29 :** జిల్లా ఉప్పునుంతల మండలం లతిపూర్ సమీపంలో డిండి జలాశయం మత్తడి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో జాతీయ రహదారి కోతకు గురి కావడంతో బుధవారం సాయంత్రం నుంచి అధికారులు రాకపోకలను నిలిపేశారు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలను అచ్చంపేట మండలంలోని హాజీపూర్ నుంచి వంగూరు మండలం చింతపల్లి కొండారెడ్డిపల్లి మీదుగా మళ్లించారు. కోతకు గురైన జాతీయ రహదారిని నాగర్ కర్నూల్ ఎస్పీ పరిశీలించారు. దీనిపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు అధికారులు సమాచారం అందించారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండ పోత వర్షాలు కురుస్తున్నాయి.

## దిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్నా : షేక్ హసీనా



**దిల్లీ :** దిల్లీలో తాను స్వేచ్ఛగా నివసిస్తున్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పేర్కొన్నారు. అయితే తన కుటుంబంపై జరిగిన హింసాత్మక దాడుల నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5 నుంచి బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటి నుంచి ఆమె దిల్లీలో నివసిస్తున్నారు. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే హసీనా బుధవారం తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఆవామీ లీగ్ పార్టీ నేతలపై ఆరోపణలు, స్వదేశానికి తిరిగి వెళ్లాలనే ఆలోచనలు మొదలైన విషయాల గురించి హసీనా మాట్లాడారు. వచ్చే ఏడాది బంగ్లాలో జరగనున్న జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయకపోతే.. తమకు ఉన్న లక్షలాది మంది మద్దతుదారులు ఎన్నికలను బహిష్కరిస్తారన్నారు. భవిష్యత్తులో తన స్వదేశంలో అధికారం చేపట్టడానికైనా.. ప్రతిపక్ష పాత్ర పోషించడానికైనా తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. బంగ్లాదేశ్‌లో రాజ్యాంగ పాలన, రాజకీయ స్థిరత్వం తీసుకురావాలంటే తిరిగి తమ ప్రభుత్వం అధికారం చేపట్టాలని అన్నారు. దేశ భవిష్యత్తును ఏ ఒక్క వ్యక్తిగానీ కుటుంబం కానీ నిర్వహించాలని తాను అనుకోవట్లేదని స్పష్టం చేశారు. తాను దేశం విడిచి వెళ్లిన అనంతరం అవామీ లీగ్ నేతలపై దాడులు చేయడం, పార్టీపై నిషేధం విధించడంతో అక్కడి తాత్కాలిక ప్రభుత్వం తమ స్వీయ ఓటమిని ఒప్పుకుందన్నారు. తదుపరి అధికారంలోకి వచ్చే ప్రభుత్వమైనా రాజ్యాంగబద్ధంగా ఎన్నికవ్వాలని ఆకాంక్షించారు. యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హసీనా ఖండించారు. అవన్నీ రాజకీయంగా తనను బలహీనపరచడానికి చేసిన కుట్రగా పేర్కొన్నారు. తనపై అభియోగాలు నమోదు చేసే ముందు బంగ్లాలోని కోర్టులు కూడా తనకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదన్నారు. తన వాదనను వినిపించడానికి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5 నుంచి బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. ఈ అల్లర్లలో 1400 మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. అనంతరం ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వం షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీని నిషేధించింది. అయితే ప్రభుత్వ నిషేధాన్ని తాము అంగీకరించడం లేదనీ, తమ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయని అవామీ లీగ్ స్పష్టం చేసింది.

# ఓటర్ల జాబితా సవరణలు అవసరమే!



ఓటరు నమోదు ప్రక్రియలో లోపాలను సరిచేయడంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికీ పక్కా ప్రణాళిక లు చేపట్టడం లేదు. ఆధార్ తరహాలో పర్మినెంట్ నంబర్ వచ్చేలా, మార్పులు చేర్పులు చేసుకునేలా వ్యవస్థను పటిష్టం చేయడం లేదు. సాంకేతికంగా ఇంతగా అభివృద్ధి చెందిన దశలో ఇసి సాంకేతికతను అందిపుచ్చుకోవడం లేదు. బీహార్‌ల చేపట్టిన ఓటర్ల సవరణ సర్ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అయితే అందులో విపక్ష కాంగ్రెస్ పార్టీ కుట్రకోణం కూడా ఉంది. ఓట్లను తొలగిస్తే ప్రజలు తిరుగుబాటు చేయాలి. తమ ఓట్లు గల్లంతు అయ్యాయని చెప్పాలి. కానీ ఎక్కడా ఇలాంటి ఆరోపణలు రాలేదు. ఒకవేళ ఒకటిరెండుచోట్ల వచ్చినా, స్థానిక అధికారులను కలిసి వారు తమ ఓటును పునరుద్దరించుకున్నారు. పెద్ద మొత్తంలో ఓట్లు గల్లంతు అయినట్లుగా ..ఓట్ చోరీ గురించి ఆరోపణలు చేసి, అభాసుపాలయిన రాహుల్ గాంధీ ఎక్కడా ఓట్ల గల్లంతుపై ఒక్కటంటే ఒక్క అఫిడవిట్ దాఖలు చేయలేకపోయారు. సుప్రీం కూడా ఇదే సూచించింది. ఓట్లు గల్లంతయిన వివరాలను సమర్పించాలని కోరితే రాహుల్ ఇప్పటికీ ముందుకు రాలేకపోయారు. అంటే ఇందులో ప్రచారయావ తప్ప నిజాలు లేవని తెలుస్తోంది. ఈ క్రమంలో దేశంలోని మరికొన్ని రాష్ట్రాల్లో సర్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది.

దేశంలో చనిపోయిన వారి ఓట్లతో పాటు అక్రమంగా చొరబాటు ద్వారా వచ్చిన వారి ఓట్లను గుర్తించి తొలగిచాల్సిందే. ఇందులో ఎలాంటి రాజీపడాల్సిన అవసరం లేదు. మన ఓటర్ల జాబితాలో దేశ విద్రోహశక్తులు చేరి, మన ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే చర్యలు వ్యతిరేకించాల్సిందే. రోహింగ్యాలు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి తిష్టవేసిన వారి ఓట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించాల్సిందే. ఎన్నికల పక్రియకు రెండు నెలల ముందు బీహార్‌లో చేపట్టిన ఎస్‌ఐఆర్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో అత్యున్నత న్యాయస్థానంలో పలు కేసులు దాఖలయ్యాయి. విచారణ చేపట్టారు. ఓట్ల తొలగింపు ఆధారాలు చూపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని విపక్షనేత రాహుల్‌కు సుప్రీం సూచించింది. అయితే దీనిపై ఆయన ఒక్క అఫిడవిట్ కూడా దాఖలు చేయలేదు. ప్రస్తుత దశలో వివిధ రాష్ట్రాల్లో 51 కోట్ల మందిపైగా ఓటర్ల వివరాలు నిగ్గుతేల్చే ఎస్‌ఐఆర్‌ను చేపట్టడం ప్రజాస్వామ్యం పట్ల నిబద్దతను చాటుకోవడంగానే చూడాలి. ఈ వ్యవహారంలో రాజకీయ పార్టీలు తప్పుదోవ పట్టించే ప్రకటనలు మానాలి. స్థానిక సంస్థలకు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎస్‌ఐఆర్ చేపట్టవద్దని కేరళ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదే. ఇది ఓ రకంగా ఓఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుంది.

ఎవరు ఓటరో కాదో తేల్చుకునే బాధ్యత ఎన్నికల సంఘానిదే. ప్రసాజ్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయడం అత్యవసరం. ప్రజలు తమ ఉపాధి, విద్య, ఉద్యోగం తదితర అవసరాల కోసం అనేక ప్రాంతాలకు వెళుతుంటారు. కొంతమంది చనిపోవడం, 18 ఏళ్లు నిండినవారు కొత్తగా నమోదు కావడం కూడా జరుగుతుంది. ఈ క్రమంలో ఓటర్ల జాబితా ఆధునీకరణ పక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా, రాజకీయ పక్షపాత రహితంగా, అనుమానాలకు తావివ్వని విధంగా చేపట్టాల్సిందే. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికలు భారత రాజ్యాంగ మౌలిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిది. వాటిని నిర్వహించే ఎన్నికల కమిషన్ ఈ వ్యవస్థను బలోపేతం చేస్తూ పోవాల్సిందే. అయితే శేషన్ లాంటి వారు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో పారదర్శక ఎన్నికలకు అవకాశం ఏర్పడింది. ఆ తరవాత ఎన్నికల కమిషనర్లుగా వచ్చిన వారెవ్వరూ శేషన్ అడుగుజాడల్లో నడవలేదు. ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకాలను చేపట్టే విధానాన్ని మోడీ ప్రభుత్వం మార్పు చేసింది. సిజెఐని తొలగించి, ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని సభ్యుడిగా చేర్చింది. ఈ విధానం సరికాదని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో అధికార పార్టీకి అనుచితమైన అధికారం ఉండకూడదని ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పక్కనపెడుతూ పార్లమెంటులో చట్టం చేసింది. బీహార్ ఎస్‌ఐఆర్ పక్రియపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వనే లేదు.

ప్రస్తుత పరిస్థితుల్లో తాజాగా దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్ చేపట్టడం వల్ల కొందరికి అనుమానాలు రావచ్చు. కానీ ఓటర్ల జాబితాలను నవీకరించుకోవాలన్న సంకల్పాన్ని నిలదీయలేం. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఏవైనా అభ్యంతరాలను పక్కన పెడితే నిలదీయాలి. అర్హులైన వారి ఓట్లు గల్లంతయితే అడగాలి. అంతేగానీ ప్రక్రియను చేపట్టడాన్ని నిలదీయడం లేదా బహిష్కరించడం ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. సర్ ప్రక్రియ సక్రమంగా సాగడానికి, పారదర్శకంగా జరగడానికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు తోడ్పాటును అందించాలి.

# మొంథా తుఫాన్ ప్రభావం

- హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**హైదరాబాద్, అక్టోబర్ 29 :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. మొంథా తుఫాన్ ప్రభావంతో నగరం ముసురేసింది. పలుచోట్ల గట్టిగానే కురిసింది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. నగరంలో కురుస్తున్న వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తరచూ.. సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్ హోల్స్ గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. డీప్ మ్యాన్‌హోల్స్ దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్స్ మూతలను తెరవకూడదని అశోక్ రెడ్డి సూచించారు. ఎమ్జర్గ÷న్సీ కోసం జలమండలి హెల్ప్ లైన్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు. జంట జలాశయాల గేట్లు ఎత్తిన నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నగరంలో గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. వర్షాలతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, గాంధీనగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, బర్కత్‌పురా, బీఎన్‌రెడ్డినగర్, మీర్‌పేట్, బాలాపూర్, బడంగ్‌పేట్, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, జవహర్‌నగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, దోమలగూడలో వర్షం కురుస్తోంది. నగర వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

## 24 క్యారెట్లపై 760 పెరుగుదల



**హైదరాబాద్, అక్టోబర్ 29 :** గత మూడు రోజులుగా కొండదిగుతూ వస్తున్న బంగారం ధరలు ఇవాళ స్వల్పంగా పెరిగాయి. బుధవారం ఉదయం ట్రేడింగ్‌లో తులంపై గరిష్ఠంగా రూ.700 పెరిగింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన పది గ్రాముల ధర రూ.760 పెరిగి రూ.1,21,580కి చేరింది. 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.700 పెరిగి రూ.1,11,450గా నమోదైంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,730గా, 22 క్యారెట్ల పది గ్రాముల పుత్తడి ధర రూ.1,11,600గా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1.60 లక్షల వద్ద కొనసాగుతోంది. కాగా, గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4 వేల డాలర్ల దిగువకు పడిపోవడంతోపాటు అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో దేశీయంగా ధరలు భారీగా తగ్గిన విషయం తెలిసిందే. మంగళవారం దేశీయంగా తులం బంగారంపై ఏకంగా రూ.4వేలు తగ్గింది. గత రెండు రోజుల్లో గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 200 డాలర్లకు పైగా తగ్గడంతో 3,887 డాలర్లకు పడిపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా పసిడి ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఏడాది సెప్టెంబర్ ఆఖరునాటికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) దగ్గరున్న బంగారం నిల్వలు 880 మెట్రిక్ టన్నులకు చేరాయి. గడిచిన ఏడాది కాలంలో 25.45 మెట్రిక్ టన్నులు పెరిగినట్టు మంగళవారం 2025 ఏప్రిల్-సెప్టెంబర్ విదేశీ మారకపు నిల్వల నిర్వహణపై విడుదలైన ఆర్బీఐ అర్ధ వార్షిక నివేదిక తెలియజేసింది. గత ఏడాది సెప్టెంబర్ ఆఖర్లో ఆర్బీఐ వద్ద 854.73 మెట్రిక్ టన్నులుగా ఉన్న పసిడి నిల్వలు.. ఈ ఏడాది సెప్టెంబర్ చివరినాటికి 880.18 మెట్రిక్ టన్నులకు పెరిగాయి. ఇందులో 575.82 మెట్రిక్ టన్నులు దేశీయంగానే ఉండగా, మిగతా వాటిని విదేశాల్లో ఆర్బీఐ నిల్వ చేసింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ వద్ద 290.37 మెట్రిక్ టన్నులుండగా, 13.99 మెట్రిక్ టన్నులు గోల్డ్ డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. ఈ సెప్టెంబర్ 30 నాటికి ఆర్బీఐ ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 13.92 శాతంగా ఉన్నది.

# బిహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారు

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**బిహార్ :** నీతీశ్ కుమార్‌ను ఎదురుగా పెట్టి బిహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారును నడుపుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని కేంద్రం సామాజిక న్యాయానికి వ్యతిరేక మని విమర్శించారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే మోదీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిం దన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముజఫ్ఫర్‌పుర్‌లో నిర్వహించిన తన తొలి ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లోనూ ఇది పునరావృతమవుతుందని ఆరోపించారు. "బిహార్ ప్రభుత్వం రిమోట్ కంట్రోల్ ద్వారా నడుస్తోందని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను. భాజపా కేవలం నీతీశ్ కుమార్‌ను వాడుకుంటోంది. దేశసంపద కొంతమ ంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బిహార్ వంటి ప్రాంతా లు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఛత్ పూజ సందర్భంగా దిల్లీలోని యమునా నది ఘాట్ వద్ద పూజలు చేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. ఆ తర్వాత అది కృత్రిమంగా నిర్మించిందని తెలుసుకుని వెనకడుగు వేశారు" అని రాహుల్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఎంతకైనా వెళ్తారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రయోజ నాలు కాపాడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రజలు తమ సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆధునిక నలంద విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ హయాంలోనే నాంది పడిందన్నారు. భవిష్యత్తులో అమెరికన్లు సైతం తమ ఉన్నత విద్య కోసం ఇక్కడి వస్తారని జోస్యం చెప్పారు.

# ఫుడ్ పాయిజన్.. 128 మంది విద్యార్థులకు అస్వస్థత

**తమిళనాడు :** తమిళనాడులోని ఎక్సెల్ కళాశాలలో 128మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కుమారపాళయంలోని ఎక్సెల్ కళాశాల హాస్టళ్లలో కలుషితాహారం తిని..గత మూడు రోజులుగా 128 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 26న రాత్రి భోజనం చేసిన తర్వాత నలుగురు విద్యార్థినులకు కడుపునొప్పితో పాటు వాంతులు అయ్యాయి. దీంతో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మరుసటి రోజు మూడు బాలికల హాస్టళ్లు, రెండు బాలుర హాస్టళ్లలో 55 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజులుగా మొత్తం 128మంది విద్యార్థులు అస్వస్థతకు గురయినట్లు అధికారులు తెలిపారు. ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపామన్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కళాశాలకు చెందిన పలు హాస్టళ్లలో మొత్తం దాదాపు 3,757 మంది బాలురు, బాలికలు ఉండగా..ఉమ్మడి వంటగదిలో వారికి ఆహారాన్ని తయారు చేసి వివిధ మెస్‌లకు పంపిణీ చేస్తున్నట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో నవంబర్ 2 వరకు మెస్‌లను మూసివేయాలని, కళాశాలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్ దుర్గామూర్తి కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రాథమిక విచారణలో నీటి నిల్వ ట్యాంకులను సరిగా శుభ్రం చేయనట్లు ఆహార భద్రత శాఖ అధికారులు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

# సొంత కారు లేకపోతే పిల్లనివ్వరు

## డీకే శివకుమార్ వ్యాఖ్యలు



**బెంగళూరు :** సొంతకారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వరంటూ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలను తీర్చేందుకు ప్రతిపాదించిన టన్నెల్ రోడ్ ప్రాజెక్టును సమర్థిస్తూ కాంగ్రెస్ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన మాటలను భాజపా ఎద్దేవా చేసింది. ఈ టన్నెల్ ప్రాజెక్టును రద్దు చేసి, మాస్ ట్రాన్స్‌పోర్ట్‌ను విస్తరించాలని భాజపా ఎంపీ తేజస్వీసూర్య డీకేను కలిశారు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజలు కార్లు కొనడం వెనక ఉన్న సామాజిక పరిస్థితి సూర్యకు అర్థం కాదని వ్యాఖ్యానించారు. "మీరు సొంత వాహనంలో రాకుండా నేను ఆపగలనా..? ప్రజలు వారి కుటుంబాలతో కలిసి సొంతవాహనాల్లో వెళ్లడానికే మొగ్గుచూపుతారు. వారిని కార్లు వాడొద్దని చెప్పగలమా..? అంతగా అవసరం అనుకుంటే ప్రజా రవాణా వాడుకోమని తమ నియోజకవర్గ ప్రజలకు ఎంపీలు విజ్ఞప్తి చేసుకోవచ్చు. అయితే దానిని ఎంతమంది వింటారో చూడాలి. కారులేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వడానికి కూడా ప్రజలు ఆలోచిస్తున్న పరిస్థితి ఉంది" అని శివకుమార్ మీడియాతో మాట్లాడారు. దీనిపై తేజస్వి స్పందిస్తూ.. "బెంగళూరు ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి టన్నెల్ రోడ్ ప్రాజెక్టును తీసుకువచ్చా రని ఇంతకాలం నేను అపార్థం చేసుకున్నాను. కానీ ఇది ఒక సామాజిక సమస్యను తీర్చడానికి ఉద్దేశించిందని డిప్యూటీ సీఎం స్పష్టత ఇచ్చారు. నేను ఎంత తెలివి తక్కువగా ఆలోచిం చాను" అని డీకే వ్యాఖ్య లకు కౌంటర్ ఇచ్చారు. ఉపముఖ్యమం త్రితో భేటీ సందర్భంగా టన్నెల్ రోడ్ ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయాన్ని, ప్రజారవాణాకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రతిపాదనలు చేశానని వెల్లడించారు. అయితే వాటన్నింటిని ఆయన తిరస్కరించారని చెప్పారు. బెంగళూరు ట్రాఫిక్ సమస్యలతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ ఐటీ రాజధాని కష్టాలకు టన్నెల్ ప్రాజెక్ట్ ఒక మంచి పరిష్కారం అని డీకే ఎప్పటినుంచో చెప్తున్నారు. దానివల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రజా రవాణా విషయంలో సరైన పరిష్కారం కాదని సూర్య వ్యతిరేకిస్తున్నారు.

# బట్టల షోరూమ్‌లో అగ్నిప్రమాదం

## కాలిబూడిదయిన సరుకు

**కరీంనగర్, అక్టోబర్ 29 :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ వద్ద బుధవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కపిల డ్రస్సెస్ షోరూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో క్షణాల్లోనే పక్కనున్న షాపులకు కూడా మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో బట్టల దుకాణంతో పాటు వినాయక ఎంటర్‌ప్రైజెస్, ఫొటోగ్రఫి షాపు, కెనాన్ ఫొటోగ్రఫి దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. ఈ ప్రమాదం కారణంగా కపిల దుకాణం యాజమాన్యానికి భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

# ఇద్దరు పిల్లలకు ఉరేసి తల్లి ఆత్మహత్య

**బెంగళూరు, అక్టోబర్ 29 :** కర్నాటకలోని కొప్పళ జిల్లాలో ఇద్దరు పిల్లలను హతమార్చి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. కుకనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బెణకల్ గ్రామంలో లక్ష్మి భజంత్రి (30), పిల్లలు రమేశ్ (3), జానవి(2)లను హతమార్చి తర్వాత ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సమస్యలు కారణమై ఉంటాయని భావించారు. అయితే మృతురాలు లక్ష్మి తల్లి బసవ్వ ఆరోపణలతో కొత్త అంశం వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన బీరప్ప అనే వ్యక్తితో లక్ష్మికి వివాహేతరసంబంధం ఏర్పడిందని,అతడి ఒత్తిడిని తట్టుకోలేక కొన్ని నెలలకాలంగా ఇబ్బంది పడుతున్నట్టు ఆరోపించారు. భర్త పిల్లలను వదిలిపెట్టి వచ్చేయాలని, ఇద్దరం కలసి కాపురం చేద్దామని బీరప్ప వేధించాడని అదే మానసికంగా ఇబ్బంది కలిగి లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్టు పేర్కొన్నారు. తొలుత ఇద్దరి పిల్లలను ఉరి వేసి హతమార్చిన తర్వాత లక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లా ఎస్పీ డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# పాక్‌తో సంబంధాలు..

## ఢిల్లీలో గూఢచారి అరెస్ట్

**ఢిల్లీ, అక్టోబర్ 29 :** గూఢచర్యానికి పాల్పడుతూ, నకిలీ పాస్‌-పోర్ట్ రాకెట్ నడుపుతోన్న 59 ఏళ్ల వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విదేశీ అణు శాస్త్రవేత్తలతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. నిందితుడి పేరు మహమ్మద్ అదిల్ హుస్సైనీ. ఇంకా రెండుమూడు మారుపేర్లతో విదేశాల్లోని అణుశాస్త్రవేత్తలను పలుమార్లు సంప్రదించినట్లు, పాక్ సహా పలు దేశాలకు పర్యటించినట్లు వెల్లడించాయి. అతడు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడని అధికారులు అనుమానిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి నుంచి అసలు, నకిలీ పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. దేశ భద్రతలో కీలకమైన సంస్థలకు సంబంధించిన ఐడీ కార్డులు కలిగిఉన్నట్లు గుర్తించారు. అతడి నెట్‌వర్క్ ఝూరండ్‌లోని జంషెడ్‌పుర్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోందని, అక్కడ నకిలీ ఐడీలు, పాస్‌పోర్టులను తయారుచేస్తున్నారని తెలిపారు. రష్యా అణుశాస్త్రవేత్త నుంచి డిజైన్‌ను ఇరాన్ శాస్త్రవేత్తకు విక్రయించినట్లు దర్యాప్తులో భాగంగా అదిల్ వెల్లడించినట్లు సమాచారం. అలా వచ్చిన సొమ్మును దుబాయ్‌లో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. అదిల్‌తో పాటు అతడి సోదరుడు అక్తర్ సున్నితమైన సమాచారాన్ని విక్రయించి, నకిలీ పత్రాల ద్వారా పలు దేశాలకు చెందిన పాస్‌పోర్టులు పొందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అక్తర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. కేఫ్‌ను నడుపుతోన్న మరో అనుమాతుడిని అరెస్టు చేయగా.. నెట్‌వర్క్‌లో భాగమైన మిగిలినవారు పరారీలో ఉన్నారని పోలీసు అధికారి ప్రమోద్‌సింగ్ కుశ్వాహ్ మీడియాకు వెల్లడించారు. ఈ నెట్‌వర్క్ ద్వారా ఎంతమందికి నకిలీ పాస్‌పోర్టులు అందాయనే దిశగా పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు తుంగతుర్తి రవి విజ్ఞప్తి**



**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని ఆయన తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో ఏర్పడిన మొంథా తుఫాన్ వల్ల గత కొద్ది రోజులుగా నిరంతరాయంగా వర్షాలు కురు-స్తున్నాయని, భారీ వర్షాలకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే ఇండ్ల నుండి బయటకు రావాలని, వృద్ధులు, చిన్నపిల్లల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో పిల్లలను పాఠశాలలకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ స్తంభాల పరిసరాల ప్రాంతాల్లో ప్రజలు, వాహనదారులు మరింత జాగ్రత్తగా ఉండాలని తుంగతుర్తి విజ్ఞప్తి చేశారు.



# పాడిపశువుల పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.సుభాష్
- అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్

**మొయినాబాద్ నేడు న్యూస్:** పాడి పశువుల పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.సుభాష్ పేర్కొన్నారు. బుధవారం పశువైద్యాధికారి డాక్టర్.అహ్మద్ సిబ్బందితో కలిసి మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలోని రైతుల వద్ద ఉన్న 145 పశువులకు టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొని టీకాలు వేశారు. అనంతరం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్. సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాడిపశువుల పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్.అహ్మద్, పశువైద్య సహాయక సిబ్బంది ప్రసన్న కుమార్, భీంరావు, ఘోరేమియా,పాడి రైతులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీం భరత్**



**మొయినాబాద్ నేడు న్యూస్:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజల అప్రమత్తతే శ్రీరామరక్ష అని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీం భరత్ తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను తీరం దాటిందని ఉత్తర వాయువ్య దిశగా తెలంగాణపై ఈరోజు ప్రభావం చూపనుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీం భరత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ... భారీ వర్షం ఈదురు గాలులు ఉన్నందున రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు బస్సులు, రైలు రద్దు చేశారని ఆయన తెలిపారు. ప్రజలు అవసరమైతే బయటకు రావాలని లోతట్టు ప్రాంత ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. విద్యుత్, మున్సిపల్, పోలీస్ ఇతర విభాగాల అధికారులు మొంథా తుఫాను గండం గట్టెక్కే వరకు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని రైతులు విద్యుత్ అధికారుల సూచనలు పాటించాలని భీం భరత్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్, నేడు బ్యూరో:** వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మొంథా తుఫాన్ తీవ్రస్థాయిలో బలపడుతున్న నేపథ్యంలో నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రజలను కోరారు. భారీ వర్షాలతో వాగులు,వంకలు పొంగిపొర్లిపోతున్నాయని, అత్యవసరం అయితేనే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలని, విద్యుత్ స్తంభాలు తాకరాదనీ, చెట్ల కిందా, శిధిలా భవనాల కింద లోతట్టు ప్రాంతాలలో ఉండకూడదనీ తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం ఇస్తే అధికారులు తక్షణమే సహాయక చర్యలు చేపడతారని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎద్దైనా ఇబ్బందులు ఉంటే నా డయల్ యువర్ ఎమ్మెల్యే టోల్ ఫ్రీ నెంబర్ 8096107107 నెంబర్ కి కాల్ చేస్తే నా వ్యక్తిగత సహాయక సిబ్బంది మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సహాయక చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తారని తెలిపారు.

# బస్తీ దవాఖానాలలో 4 మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీ

**31న ఇంటర్వ్యూలు**

**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా లోని భస్తీ దవాఖానలో వున్న మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన, వాక్-ఇన్ ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయుటకు అర్హతగల అభ్యర్థుల నుండి వైద్య, ఆరోగ్య శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. మల్టీ జోన్ - టు లో 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎం.బి.బి.ఎస్ ఉత్తీర్ణులై , తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లో రిజిస్టర్డ్ చేసుకుని,18 నుంచి 44 వయసు ఉన్న అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. 1.ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈ.డబ్ల్యూ.సి.ఎస్,( నాన్ క్రిమిలేయర్ అభ్యర్థులకు 5 ఏళ్ళు ), 2.ఎక్స్ సర్వీస్ మెన్, ఉమెన్, ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈ.డబ్ల్యూ.సి.ఎస్,( నాన్ క్రిమిలేయర్ అభ్యర్థులకు 5 ఏళ్ళు ), 3. ఎక్స్ సర్వీస్ మెన్ ఉమెన్ ఓసీ,బీసీ నాట్ బిలాంగ్ టు నాన్ క్రిమిలేయర్ 3 ఇయర్స్, 4. ఫిజికల్ అభ్యర్థులకు 10 ఏళ్లు ఏజ్ లో రిలాక్సేషన్ ఉంటుంది. పూర్తి చేసిన దరఖాస్తులను,ఆ ఒక ఫోటోతో జత చేసి జిల్లా కలెక్టరేట్ లోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ 31న ఉదయం : 11 నుంచి 1గంట మధ్య నిర్వహించనున్న ఇంటర్వ్యూ లకు హాజర్ కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్: ఉమా గౌరి సూచించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన వరంగల్ ఎంపీ కడియం కావ్య



**వరంగల్ ,నేడు బ్యూరో:** మొంథా తుపాను ప్రభావంతో వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజల భద్రతపై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సూచించారు.జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్, రోడ్డు భద్రత తదితర శాఖల అధికారులతో ఎంపీ డాక్టర్ కావ్య బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే ప్రమాదం ఉన్న గ్రామాలు, కాలనీల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, చెరువులు, వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. రైతుల పంటలకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో ఎవరూ చేపలు పట్టడానికి, నీటి ప్రవాహాల వైపు వెళ్లరాదని ఎంపీ ప్రజలను హెచ్చరించారు.అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని, అత్యవసర సహాయార్థం అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లకు సంప్రదించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సహాయక బృందాలను సిద్ధం చేయాలని, అవసరమైన ఆహారపదార్థాలు, వైద్య సాయం, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని కలెక్టర్లకు ఎంపీ డా.కడియం కావ్య సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు.

# క్రీడా పాఠశాల సాధనలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంకల్పం

- సాకారమైన జిల్లా క్రీడాకారుల స్వప్నం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలను సమన్వయం చేసి స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు ముందడుగు వేసిన ఎమ్మెల్యే
- నవంబర్ 14 నాటికీ స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభానికి పరిపాలన అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ ,నేడు బ్యూరో :** హన్మకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలిక ప్రాతిపదికన 14నవంబర్ 2025 నాటికీ క్రీడా పాఠశాల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల పక్షాన మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు నెలవైన ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్ని తానై ముందడుగు వేశారు. అందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను సమన్వయం చేసి వారితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రీడా పాఠశాల ఏర్పాటు అవశ్యకతను వివరించి సీఎం ని ఒప్పించి స్పష్టమైన హామీ తీసుకున్నారు. అదే తడువుగా కడియం శ్రీహరి గత కొన్ని నెలలుగా ఈ ప్రాజెక్టు కోసం అనేక సార్లు జిల్లా ఎమ్మెల్యేల సమన్వయంతో జిల్లా కలెక్టర్ , అధికారుల సహకారంతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో తాత్కాలిక క్రీడా పాఠశాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, మారమ్మత్తులు, వసతి సదుపాయాలను పూర్తి చేయించారు.హన్మకొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల శాశ్వత , తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు అయ్యే వరకు తాత్కాలిక ప్రాతిపదికన హన్మకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వులలో పేర్కొంది. 14నవంబర్ 2025నాటికీ క్రీడా పాఠశాలను ప్రారంభించాలని అందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంత ప్రజల ఆకాంక్షల ప్రతిబింబంగా ఈ నిర్ణయం నిలుస్తుందని పేర్కొన్నారు. వరంగల్ నేల యువత ప్రతిభతో నిండిపోయిందని, నేడు ఆ ప్రతిభకు వేదిక సిద్ధమైందన్నారు. యువతకు ఇది సువర్ణావకాశం అని తెలిపారు. క్రీడా ప్రోత్సాహానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# చెరువులను తలపిస్తున్న వరంగల్ నగర రోడ్లు



**వరంగల్, నేడు బ్యూరో:** వరంగల్ నగరంలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట సిటీలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది .ఈ పరిస్థితులలో ట్రైసిటీలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. హనుమకొండ బస్టాండ్ పరిసర ప్రాంతాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రయాణికులు బస్టాండ్ లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే భారీ వర్షానికి వరంగల్ లోని బట్టల బజార్,ఎల్లమ్మ బజార్, రామన్నపేట, కాశిబుగ్గ ,పోచమ్మ మైదాన్, హనుమకొండలోని బాలసముద్రం, నక్కలగుట్ట ,గోపాల్పూర్ , కాజీపేటలో డీజిల్ కాలనీ, రైల్వే జంక్షన్ తో పాటు వివిధ ప్రాంతాలు జలమయ్యాయి. డ్రైనేజీలు పొంగి ఇళ్లలోకి షాపులోకి మురుగునీరు చేరింది. రోడ్లన్నీ చెరువులను తలపిస్తుండడంతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోకాళ్ళలోతు నీటిలో ప్రయాణం చేయవలసి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు .నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

**పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

**పరకాల నేడు న్యూస్ :** మొంథా తుఫాన్ వల్ల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపట్ల నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి కోరారు. పురాతన ఇళ్లలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. వాగులు,చెరువులు,లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు వంటి ప్రాంతాలకు ప్రజలు వెళ్ళకూడదు. అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుండి ప్రజలు బయటికి రాకూడదని,ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని రైతన్నలు జర భద్రంరైతులు పొలాలలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలి. విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ తడిచిన చేతులతో తాకకకూడదు. నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుండి వెళ్లారాదు.



# మిత్రునికి ఆర్థిక సహాయం


**పరకాల నేడు న్యూస్ :** నడికుడా మండలం జడ్పీహెచ్ఎస్ 2006 2007 పదవ తరగతి బ్యాచ్ సోషల్ మీడియా వేదికగా ఐదు సంవత్సరాల క్రితం ఒక గ్రూపు తయారు చేసుకుని పదవ తరగతి మిత్రులకు ఏ అవసరం వచ్చినా మేమున్నాం అంటూ ముందుకు వస్తున్నారు. నడికుడకు చెందిన గోనెల వెంకటేష్ ఇటీవల ప్రమాదవశాత్తు కరెంటు పోల్ పై నుండి జారిపడగా విషయం తెలుసుకున్న తన తోటి పదవ తరగతి మిత్రులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్, ప్రశాంత్, రమేష్, సాయి, స్వామి రాజ్, శ్వేత, మమత, పావని తదితరులు పాల్గొన్నారు,

# వర్షం పరిస్థితులపై కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడిన మంత్రి కొండ సురేఖ



**వరంగల్, నేడు బ్యూరో :** భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వాతావరణ శాఖ వరంగల్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ చేసిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం మంత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్, అధికారులతో ఫోన్లో మాట్లాడి వర్షం కురుస్తున్న వివరాలు ఆరా తీసి పలు సూచనలు చేశారు.

# కలెక్టర్లతో వర్ష పరిస్థితులపై ఫోన్లో మాట్లాడిన పాలకుర్తి ఎమ్మెల్యే



**వరంగల్ ,నేడు బ్యూరో:** తుఫాన్ ప్రభావంతో జనగామ, వరంగల్ జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సంబంధిత జిల్లాల కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు తమ తమ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ప్రజల భద్రతపై రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, వాగులు ,డ్రైనేజీలు నిండిపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# బ్లాక్ లెవెల్ బ్యాంకర్స్ మీటింగ్స్ వాయిదా

**ఎల్.డి.ఎం శివ ప్రసాద్**

**మేడ్చల్ నేడు బ్యూరో:** ఈ నెల 30న నిర్వహించాల్సిన జాయింట్, బ్లాక్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాలు ప్రతికూల వాతావరణం వలన వాయిదా వేయడం జరిగిందని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎల్.డి.ఎం శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల తేదీలను తిరిగి తెలియజేయడం జరుగుతుందనీ ఆయన వెల్లడించారు.



# భారీ వర్షాన్ని లెక్కచేయక... రక్తదాన శిబిరానికి తరలివచ్చిన యువత

**పాలకుర్తి,నేడు న్యూస్:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకోని వరంగల్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు డీసీపీ వెస్ట్ జోన్ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఏసీపి నర్సయ్య పాలకుర్తి లోని బషారత్ ఫంక్షన్ హాల్లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వర్ధన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల అధ్వర్యంలో రెడ్ క్రాస్ రక్తనిధి సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది యువతకు స్ఫూర్తి కలిగించే రీతిలో ఈ రక్తదాన శిబిరంలో ముందుగా పోలీస్ అధికారులు రక్తందానం చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక యువత, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎసిపి అభినందించడంతో పాటు వారికి పండ్లు, సర్టిఫికేట్లను అందజేసారు. అనంతరం ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో వుంటారని, ముఖ్యంగా రక్తదానంపై వున్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలని సూచించారు. ఇట్టి రక్తాదాన శిబిరంలో 150 మంది యువత పాల్గొన్నారు..ఈ కార్యక్రమంలో సీఐ లు జానకి రామ్ రెడ్డి పాలకుర్తి, శ్రీనివాస్ వర్ధన్నపేట, ఎస్ఐ లు (పాలకుర్తి) పవన్ కుమార్, (దేవరుప్పుల) సృజన్ కుమార్, (వర్ధన్నపేట) సాయిబాబు, (జఫర్ గడ్) రామారావు, (రాయపర్తి) రాజేందర్ మరియు లింగారెడ్డి, యాకుబ్ హుస్సేన్, కోడకండ్ల ఏఎస్సై రమేష్ మరియు పోలీస్ సిబ్బంది హన్మకొండ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు డా.మదన్ మోహన్, జి శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు, మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు..



# దివ్యాంగ్ విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు అందించిన (ట్రైనీ)డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత

**వరంగల్, నేడు బ్యూరో:** శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు నూగూరి చంద్రమోహన్, కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పరకాల ప్రభుత్వ భవిత సెంటర్ లో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు పురిఫైడి వాటర్ ఫిల్టర్ పుస్తకాలు,బ్యాగులు, వాటర్ బాటిల్లతో పాటు విద్యార్థులు చదువుకోవడానికి అవసరం అయ్యే వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన (ట్రైనీ) డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత మాట్లాడుతూ అవసరార్థులకు ఆపన్న హస్తంఅందిస్తూ మేమున్నామంటూ ముందుకు సాగుతున్న శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులను కొనియాడారు. విద్యార్థులకు పుస్తకాలతో పాటు వాటర్ ప్యూరిఫైడ్ ఫిల్టర్ తదితర వస్తువులను అందించడాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతంగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు వారి తల్లి దండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పరకాల ఎం.ఈ.ఓ. ఎస్. రమాదేవి కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి.సుదర్శన్ రెడ్డి, విష్ణువర్ధన్, కోర్ కమిటీ సభ్యులు వి. రమేశ, యం. శ్రీనివాస్ సురేష్ కాంప్లెక్స్ హెడ్మాస్టరులు సి.హెచ్. మధు, సి. సురేందర్ రిసోర్స్ పర్సన్స్ జి .రమాదేవి , సి.ఆర్. పి.లు ఏ.రమేశ్ బాబు,శ్రీలత , శ్రీనివాస్ పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మొయినాబాద్ కాంగ్రెస్ నాయకులు

**మొయినాబాద్ నేడు న్యూస్:** జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లగోల్ల అశోక్ యాదవ్ మరియు నాయకులు కార్యకర్తలు నవీన్ యాదవ్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లగోల్ల అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఊహించని విధంగా భారీ మెజారిటీతోని నవీన్ యాదవ్ గెలుస్తున్నాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రచారంలో పాటీ ప్రసాద్ రెడ్డి, నందకిషోర్ యాదవ్, ఫైల్మాన్ శ్రీనివాస్ యాదవ్, అత్తాపురం సదానందం గౌడ్, బైకని మల్లేష్ యాదవ్, నాయకులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



## బాయర్ కంపెనీ నూతన ఉత్పాదన కెమాలస్ క్షేత్ర ప్రదర్శన

**పరకాల నేడు న్యూస్ :** పరకాల మండలం లోని మల్లకపేట గ్రామారైతుబొజ్జం రవీ మిరప తోటలో కెమాలస్ అర్ధ ఎకరాకు స్ప్రే చేయించారు.వాడిన 8 రోజుల తరువాత క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.రైతుల నేరుగా కెమాలస్ వాడిన పొలాన్ని మరియు వాడని పొలాన్ని పరిశీలించి ,కెమాలస్ వాడిన పొలం లో ఆకు తినే పురుగు మరియు రసం పీల్చే పురుగులు లేకుండా నివారణ అయ్యి కొత్త చిగురు రావడం గమనించారు.కెమాలస్ వాడిన పొలాన్ని చూసి వచ్చిన 80 మంది రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మండల కిరణ్, పీల్లెల శివసాయి, ఎంబాడి పరమేష్, సెమినిస్ దయాకర్ రెడ్డి పాల్గొన్నారు..

## ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### మండల అభివృద్ధి అధికారి సంధ్య



**మొయినాబాద్ నేడు న్యూస్:** మండలంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొయినాబాద్ మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. బుధవారం ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ సముద్రంలో ఏర్పడిన అల్పవడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలకు ఎంతో నష్టం చేకూరే అవకాశం ఉందన్నారు. కురుస్తున్న వర్షాల సందర్భంగా గ్రామాలలోని ప్రజలు అత్యవసర ఉంటే తప్ప బయటకు రాకూడదని తెలిపారు. ముఖ్యంగా పురాతన ఇళ్లల్లో ఉన్న వారు ముందస్తుగా వేరే ప్రాంతాన్ని ఎంచుకోవాలని ఆమె కోరారు. ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటల వద్దకు వాగుల వద్దకు వెళ్లకూడదని ప్రమాద హెచ్చరికలు ఉన్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. మొయినాబాద్ మండలంలో బుధవారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వరద నీరు ఎక్కువై వాగులు ప్రవహించే అవకాశం ఉందన్నారు. ప్రజలు తుఫాన్ వర్షంతో అప్రమత్తంగా ఉండాలని కోరారు.



## తుఫాన్ బీభత్సం

**కారేపల్లి, నేడు న్యూస్:** గురువారం సాయంత్రం కారేపల్లి మండలంలో తుఫాన్‌తో కూడిన ఎడతెరిపి లేని వర్షం కురిసింది. గాలివాన తీవ్రంగా వీచడంతో పలు గ్రామాల్లో చెట్లు కూలిపోవడంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. పోలంపల్లిలో పెద్ద చింత చెట్టు కూలి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామం చీకటిలో మునిగిపోయింది. మాదారం పెద్ద చెరువు కుంట నుండి వస్తున్న వరద నీరు రహదారి మీదుగా ప్రవహించడంతో రోడ్డులో గుంటలు ఏర్పడటంతో పాటు పక్కన ఉన్న పంట పొలాలు ముంచెత్తాయి. వర్షం ప్రభావంతో ప్రజలు ఇళ్లలోనే ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక అధికారులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.





## కారేపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.సాగర్‌ను వినయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు

**కారేపల్లి, నేడు న్యూస్:** కారేపల్లి మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.సాగర్‌ను జిల్లా సహాయ కార్యదర్శి అదెర్ల వినయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతి భద్రతా వ్యవస్థ, ప్రజా సేవలు, పోలీసు విభాగం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సవివరంగా చర్చ జరిగింది. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.సాగర్ మాట్లాడుతూ, ప్రజా సేవలో పోలీసులు పోషిస్తున్న కీలక పాత్రను ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో మరింత సమన్వయంతో ప్రజలకు చేరవవుతూ పనిచేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మిట్టగనపుల సాంబ, గడ్డం దిలీప్, గజ్జల సంపత్, అదెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పరిశ్రమ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

- పత్తాలేని కార్మిక శాఖ అధికారులు
- రాత్రి సమయాల్లో ప్రైవేట్ పరిశ్రమల్లో మహిళలతో పనులు
- ఇతర రాష్ట్రాల మహిళలతో 12 గంటలు పనిచేయిస్తున్న కాంట్రాక్టర్లు
- అనుకోని సంఘటన జరిగితే బాధ్యత ఎవరిది...?
- లేబర్ కాంట్రాక్టర్ కు కమిషన్ ఇచ్చి పని చేయించుకునే పరిశ్రమదా...?
- పరిశ్రమ దగ్గర కమిషన్ పద్దతిలో డబ్బులు తీసుకుని పని చేయించే లేబర్ కాంట్రాక్టర్ దా...?
- రాత్రి సమయంలో మహిళలతో పని చేయించే సూపర్వైజర్ దా...?



**మేడ్చల్, నేడు న్యూస్:** దేశానికి వలస పాలకుల నుంచి విముక్తి లభించింది కానీ స్త్రీకి మాత్రం పురుషాధిక్య సమాజం నుంచి ఇంకా స్వాతంత్రం పొందలేదు అనేది గత నానుడి అయితే... కార్మిక చట్టం ప్రకారం ఎనిమిది గంటల వరకు పని చేయించుకోవాల్సిన ప్రైవేట్ కాంట్రాక్టర్లు సుమారు 12 గంటల పాటు పని చేయించుకుంటూ సరైన వేతనం ఇవ్వకుండా తన చెమట చుక్కల నుంచి వచ్చే కష్టానికి ప్రతిఫలం దక్కడం లేదనేది నేటి నానుడి. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ పుణ్యమా అని స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం అమలవుతున్న... ప్రజల చేత ఎన్నికైన మహిళలు సైతం. తన అధికారాలను వినియోగించుకోలేని పరిస్థితి. అధికారిక హోదాలో ఉన్న ఏం మాట్లాడాలో నిర్దేశించేది పురుషులే అని పలువురు మహిళలు అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా పలువురు ప్రైవేట్ కాంట్రాక్టర్లు పలు ప్రైవేట్ పరిశ్రమలలో మహిళలతో 12 గంటల పాటు పని చేయించుకుంటూ తగిన వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మరి కొంతమంది మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రి సమయాల్లో ప్రైవేట్ పరిశ్రమల్లో మహిళల విధులు :**

మేడ్చల్ మండలంలోని పలు ప్రైవేట్ పరిశ్రమలలో తెలుగు రాష్ట్రాల మహిళలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలతో రాత్రి 7,8 గంటల నుంచి ఉదయం 7,8 గంటల వరకు ప్రైవేట్ కాంట్రాక్టర్లు పనులు చేయిస్తున్నారు. ఇదే విషయంపై సంబంధిత లేబర్ అధికారులు కనీసం పరిశ్రమలపై కన్నీటి చూడకపోవడంతో పాటు పట్టించుకోవడం లేదని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

**12 గంటలు ఇతర రాష్ట్రాల మహిళలతో పనిచేస్తున్న ప్రైవేట్ పరిశ్రమల కాంట్రాక్టర్లు :**

ఒడిస్సా, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలతో 12 గంటల పాటు ప్రైవేట్ కాంట్రాక్టర్లు తమ కాంట్రాక్ట్ లో పరిశ్రమ నుంచి ఒక లేబర్ కి కమిషన్ కొంతమేరకు మాట్లాడుకుని వారికి చెల్లించాల్సిన ఫిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించకుండ వెట్టిచాకిరి చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎనిమిది గంటలకు పైగా సదరు మహిళలతో పనిచేయించుకోవాలంటే ఆ మహిళల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలకు తెలుగు రాకపోవడంతో ఇదే అదునుగా, ఆసరాగా చేసుకునే పలు ప్రైవేట్ కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే 12 గంటల పాటు వెట్టి చాకిరి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(మహిళా కార్మికులకు అనుకోని సంఘటన జరిగితే బాధ్యత పరిశ్రమదా...? కాంట్రాక్టర్ దా...? పనిచేయించే సూపర్వైజర్ దా...?... మరిన్ని పూర్తి వివరాలు 'నేడు' మరో కథనం)

## అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి
- అటవీ శాఖ ఆధ్వర్యంలో శాంతి వనంలో మొక్కలు నాటిన అధికారులు




**బోడుప్పల్, నేడు న్యూస్:** అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి కోరారు. డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ షికా గోయల్ ఐపీఎస్ ఆదేశానుసారం విజిలెన్స్ వారోత్సవాలు–2025లను మేడిపల్లి శాంతి వనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాదు రూరల్ యూనిట్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రెండవ రోజు శాంతి వనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అటవీ అధికారి ఎం. వేణు మాధవ్ మాట్లాడుతూ.. అవినీతి రహిత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజలలో విజిలెన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వ ధనం వృధా కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ అటవీ శాఖకు సహకారం అందించాలని ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పనులు విజయవంతంగా చేయగలుగుతామని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి, శాంతి వనం కి వచ్చిన వాకర్స్, అటవీ, బోడుప్పల్ మున్సిపాలిటీ సిబ్బందితో విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, హైదరాబాద్ రూరల్ యూనిట్ పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధికి ఎటువంటి గండి పడకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిదని, ప్రభుత్వ అధికారులు నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలు వారి సమస్యలను విజిలెన్స్ శాఖ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలు తమ సామాజిక బాధ్యతను తెలుసుకొని మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఫారెస్ట్ రేంజ్ అధికారి జే. విష్ణువర్ధన్ రావు, ఉప్పల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శరత్ చంద్ర, విజిలెన్స్ అధికారులు, బోడుప్పల్ మున్సిపాలిటీ సిబ్బంది, శాంతి వనం కి వచ్చే వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.





## జమిలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్

**కారేపల్లి, నేడు న్యూస్:** తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాతృమూర్తి మూడ్ జమిలి ఇటీవల ఉసిరికాయలపల్లిలో మృతి చెందటంతో జమిలి కుటుంబాన్ని వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ గురువారం పరామర్శించారు. జమిలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులైన పెద్ద కుమారుడు మూడ్ శోభన్, రెండో కుమారుడు ఎండోమెంట్ శాఖ జూనియర్ అసిస్టెంట్ మూడ్ మోహన్, కోడలు మాజీ ఎంపీటీసీ మూడ్ జ్యోతి, చిన్న కుమారుడు రవిలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైరా ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్, మాజీ ఎంపీటీసీలు ధరావత్ పాండ్యా నాయక్, పెద్దబోయిన ఉమాశంకర్, భాగం రూప నాగేశ్వరరావు, మాజీ సర్పంచులు మాలోత్ కిషోర్, బానోత్ బన్సీలాల్, బానోత్ పద్మా రాందాస్, బానోత్ పద్మా మోహన్, సొసైటీ డైరెక్టర్ మర్సకట్ల రోశయ్య, మండల నాయకులు అజ్మీర వీరన్న, వాంకుడోత్ నరేష్‌నాయక్, భూక్యా మోతిలాల్, వాంకుడోత్ హనుమంతు, భూక్యా ప్రసాద్, జల సాంబ, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



## అవినీతిని నిరోధించేందుకు అవగాహన కీలకం

### విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** అవినీతిని నిరోధించడానికి అవగాహన ఎంతో కీలకమని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా స్థాయిలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివరాంపల్లి హైస్కూల్లో నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహించారు. సమాజంలో అవినీతిని ఎలా నిర్మూలించాలన్నారు. అవినీతిరహిత భారతదేశాన్ని ఎలా తయారు చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి డీఈఓ సుశీంద్రరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అవినీతిని నిర్మూలించడానికి అందరూ చేయి చేయి కలుపాలన్నారు. అవినీతిని నిరోధిస్తే దేశం అభివృద్ధిలో ఇది ఎంతో కీలకం కానుందన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ రాథోడ్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్య శ్రీను నాయక్, విజిలెన్స్ అధికారులు శిఖగోయల్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌వీ అండ్ ఈవో, ఎస్.వెంకన్న, వెంకట్ రెడ్డి,రామకృష్ణ, అరుణ, దేవికలు, పీడీ గాంగ్యా నాయక్, ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు రూపా దేవి, మొగులయ్య, సుధాకర్లు వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, వెంకటయ్య, నర్సింహా చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ పట్ల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

### సహాయక చర్యలలో నిమగ్నమైన ఎస్సై కరుణాకర్, కార్యదర్శి లక్ష్మీకాంత్

**ఇరుగుర్తి, నేడు న్యూస్:** మొంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముందస్తుగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తరంగిణి, ఎస్సై కరుణాకర్ ప్రజలకు సూచించారు. బుధవారం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో చెరువులు కుంటలు వాగుల వద్ద భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని భోయినని బజారు, నెక్కొండ రోడ్డు వైపు 20 ఇండ్లకు వరద ముప్పు ఉండగా, అది గమనించిన ఎస్సై కరుణాకర్ జెసిబి సహాయంతో నీటిని మళ్ళించారు. అదేవిధంగా మసీదు సమీపంలో రోడ్డుకు లోతట్టులో ఉన్న సుమారు 20కి పైగా ఇళ్లలోకి వరద నీరు చేరి మునిగిపోవడంతో అప్రమత్తమైన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ జెసిబి వాహనం ఏర్పాటు చేసి రోడ్డు ప్రక్కన తాత్కాలికంగా కాల్వను త్రవ్వించి నీటిని మళ్ళించడంతో పెను ప్రమాదం తప్పి అంతా ఊపిరి పీల్చుకున్నారు. కోమటిపల్లి గ్రామంలో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో తహసిల్దార్ తరంగిణి సహాయక చర్యలు చేపట్టారు. చిన్న ముప్పారం నుండి లక్ష్మీపురం వైపు వెళ్ళు వాగు పొంగడంతో అలాగే మండలం నుండి సీతారాంపురం వైపు వెళ్ళు రహదారిలో ఉన్న వాగు, మండల కేంద్రం నుండి తొర్రూర్ వైపు వెళ్ళు ప్రధాన రహదారిపై చిన్ననాగారం గ్రామ చెరువు ముత్తడి పోయడంతో వాగుల చింత వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎస్సై కరుణాకర్ ఆధ్వర్యంలో బారి కేడ్లు ఏర్పాటుచేసి వరద ప్రవాహం తక్కువ అయ్యే వరకు రాకపోకలు సాగించవద్దని బందోబస్తు ఏర్పాటు చేశారు.





## మళ్లీ అదే చోట తెగిన కెనాల్

**ఇనుగుర్తి, నేడు న్యూస్:** మండలంలోని మిట్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని మర్రికుంట తండా సమీపంలో లైన్ తండా వద్ద ఎస్సారెస్పీ కెనాల్ కు భారీ వర్షాలతో బుధవారం గండి పడింది. కాగా, గత సంవత్సరం ఇక్కడే మరమ్మత్తులు చేపించారు. దీంతో ఒకేచోట మూడుసార్లు తెగడంతో చేసిన మరమ్మత్తు పనులు వాటి నాణ్యత పై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తూ విమర్శలు చేస్తున్నారు.

## శ్రీసోమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం

**పాలకుర్తి , నేడు న్యూస్:** శ్రీసోమేశ్వర లక్ష్మీన ర్సింహస్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం కార్తీక దీపోత్సవం వైభ వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. దీపోత్సవంలో పాల్గొన్న మహిళలకు తాంబూలం, ప్రసాదం వాయినంగా అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, సిబ్బంది ,భక్తులు పాల్గొన్నారు.



# మేడ్చల్ జిల్లాలోనే ఫస్ట్

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీలకు డబ్బుల బెడ్ రూమ్‌లు

- జిల్లాలో 275 ఇళ్లు కేటాయింపు
- ఇప్పటికే 63 మందికి పంపిణీ
- మిగిలిన వారి జాబితా సిద్ధం చేస్తున్న పోలీస్ అధికారులు
- చొరవ తీసుకున్న ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్

**మేడ్చల్ నేడు బ్యూరో:** ఘోరమైన దారుణాలకు గురైన ( అట్రాసిటీలు) ఎస్సీ, ఎస్టీ లకు డబుల బెడ్ రూం లు పంపిణీ చేయడం ద్వారా మేడ్చల్ జిల్లా రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచింది. తద్వారా జిల్లా యంత్రాంగం తన మానవతను చాటుకుంది. ఫలితంగా, పలువురి ప్రశంసలు అందుకుంటోంది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సైతం జిల్లా అధికారులు, పోలీస్ లకు ప్రశంసించడం విశేషం.



### జిల్లాలో 275 మంది అట్రాసిటీ బాధితులకు డబుల్స్ :

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా 2016 లో ఏర్పడింది. ఇందులో, రెండు రెవెన్యూ డివిజన్లు కీసర, మల్కాజిగిరి డివిజన్లలో కలిపి ఐదు నియోజకవర్గాలు కూకట్ పల్లి , కుత్బుల్లా పూర్, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్ నియోజక వర్గాలలో కలిపి 15 మండలాలు న్నాయి. ఈ 15 మండలాల పరిధిలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లు ( నిజాం పేట, జవహర్ నగర్, బోడుప్పల్ , ఫిర్జాదిగూడ) తొమ్మిది మున్సిపాలిటీలు, 61 గ్రామ పంచాయతీలు ఉండేవి. తర్వాత నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లకు చేరుకోగా, అదనంగా మరో మూడు మున్సిపాలిటీలు పెరిగాయి. ఇక ఇటీవల కాలంలో మేడ్చల్ జిల్లాను మొత్తంగా అర్బన్ జిల్లాగా ప్రకటించారు. దీనితో, గ్రామ పంచాయతీలు అన్ని కూడా మున్సిపాలిటీల్లో విలీనమై పోయాయి. జిల్లా జనాభా మొత్తంగా అరకోటి పైగా చేరుకోగా, ఓటర్లు 35 లక్షలకు చేరుకుంది.

### జిల్లాలో వలసలు - అట్రాసిటీ బాధితులు ఎక్కువే :

హైదరాబాద్ మహానగరానికి ఉపాధి కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చే వారు అధిక మొత్తంలోనే ఉంటారన్న విషయం తెలిసిందే. హైదరాబాద్ మహానగరంలో నివాసం ఖర్చుతో కూడు కున్నందున నగర శివారు ప్రాంతం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోనే వీరు ఎక్కువగా స్థిరపడుతున్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతం కూకట్పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, మేడ్చల్, ఉప్పల్, జవహర్ నగర్, ప్రాంతంలో వలస జీవుల సందడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా, ఒరిస్సా, బీహార్, యూ.పీ, మహారాష్ట్ర, భీధర్ ( కర్ణాటక ) ల నుంచి వచ్చి స్థిరపడిన వారే ఇందులో ఎక్కువగా ఉంటారు. అందువల్ల ఈ ప్రాంతంలో గోరా లు నేరాలు కూడా ఎక్కువే. వీటి నిరోధానికి ప్రభుత్వం, పోలీస్ అధికారులు ఎంత ప్రయత్నం చేసినా జరగాల్సిన నేరాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఘోరాలు, నేరాలు, హత్యాచారాలకు గురవుతున్న వారిలో ఎక్కువగా నీరు పేదలు, దళిత, బహుజనులే అన్న విషయం వేరే చెప్పనవసరం లేదు. వీరిని ఆదుకో వాల్సిన అవసరం సభ్య సమాజం, ప్రభుత్వం పైనా ఎంతైనా ఉంది.

### నష్టపరిహారంతో పాటు పునరావాసం, ఉపాధి అవసరమే

హత్యలూ, అత్యాచారాలు, దారుణాలకు గురై ఏ దిక్కూ లేకుండా దిక్కులేని వారై పోయిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చట్టాలను తీసుకువచ్చాయి. అందులో భాగమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం. దీని అమలులో భాగంగా ప్రభుత్వాలు అట్రాసిటీ లకు గురైన వారికి నష్టపరిహారం చెల్లించడంతో పాటు పునరావాసం, ఉపాధి కల్పన కల్పించాలని చట్టం చెబుతోంది. అయితే, ఇప్పటి వరకు బాధితులకు నష్ట పరిహారం, ఉపాధి కల్పనకు చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగం తాజాగా, పునరావాసం కల్పించడానికి చర్యలు చేపడుతోంది. ఎస్సీ ,ఎస్టీ కమీషన్ సూచనలతో, తాజాగా పునరావాసం ప్యాకేజీని కూడా అమలు చేస్తోంది.

### ఇప్పటికే 63 ఇళ్ళు పంపిణీ:

అందులో భాగమే బాధితులకు డబుల్ బెడ్ రూం ల పంపిణీ చేస్తోంది. జిల్లాలో వీరికి 275 ఇళ్ల కోటాను కేటాయించగా. ఇప్పటికే, జిల్లాలో 63 మందికి పంపిణీ చేశారు. ఇందులో, రాంపల్లిలో 33, తూంకుంటలో 18, మరోచోట 15 మందికి ఇచ్చారు. మిగిలిన మరో 212 మందికి కేటాయించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు,ఎస్సీ,ఎస్టీ కమిషన్ లు కలిసి అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

---

# తుఫాను ప్రభావంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### గుండాల మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం తేజం రెడ్డి



**గుండాల నేడు న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న మొంథ తుఫాను ప్రభావంతో గుండాల మండలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తేజం రెడ్డి మండల ప్రజలకు పిలుపునిచ్చారు . ఈ సందర్భంగా నేడు న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల తుఫాను ప్రభావం వల్ల ప్రజలు చెట్ల కింద కరెంటు స్తంభాల పక్కన శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో పూరి గుడిసెలో నివసించకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు. అంతేకాకుండా గుండాల మండలం గ్రామాల్లో పాడుపడ్డ ఇండ్ల కింద తలదాచుకోవద్దని కరెంటు వైర్లు విద్యుత్తు స్తంభాలు ప్రమాదం భారీతంగా కనిపిస్తున్న ఏ ఇతర ప్రాంతాల్లో ప్రజలు ఈ వర్షాలకు తలదాచుకోకుండా వెనక ముందు ఆలోచించుకోవాలని ఆయనే సూచించారు . ఈ తుఫాను కారణంగా ఎలాంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగకుండా ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాకుండా సాధ్యమైనంత వరకు వర్షాలు తగ్గేవరకు జాగ్రత్త వహించాలని సూచించారు . అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ భారీ వర్షాల కారణంగా గుండాల మండల మరియు ప్రాంత శివారులో ప్రజలను చైతన్య చేస్తూ ఈ తుఫాను ప్రమాదాలను తెలుసుకోకుండా నివారించే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అన్నారు ప్రజల శ్రేయస్సు కోసం పోలీసులు నిరంతరం ప్రజా సమస్యల పట్ల దృష్టి కేంద్రీకరిస్తున్నామని ఇందులో భాగంగానే భారీ వర్షాల పట్ల పోలీసులు స్పందించడం జరుగుతుందని తెలిపారు ఎవరైనా ఎక్కడైనా ఎలాంటి ప్రమాదం జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు గ్రామ ప్రజలకు ఎలాంటి నష్టం కలవకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు

---



# మనసున్న మారాజు ఎస్సై పవన్ కుమార్

### తక్షణమే స్పందించి పునరావాసం ఏర్పాటు

**పాలకుర్తి, నేడు న్యూస్:** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ వెనకవైపున ఎర్ర మల్లయ్య కుంట వద్ద తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్న బుడగ జంగాల కాలనీ,సందర్శించి, ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వారి గుడిసెలు మొత్తం, వరద నీటితో మునిగిపోయి, వారి నిత్యవసర వస్తువులు బట్టలు మొత్తం తడిసిపోయి, చిన్నపిల్లలు వృద్ధులు వర్షానికి తడిసి గజగజ వణుకుతున్న వృద్ధులను మహిళలను చిన్నపిల్లలను చేరదీసి బీసీ హాస్టల్ అధికారులతో మాట్లాడి హాస్టల్లో ఆశ్రయం కల్పించిన పాలకుర్తి ఎస్సై పవన్ కుమార్. తన గొప్ప మనసును చాటుకున్నారు . ఇట్టి కార్యక్రమంలో ఎస్సై యాకూబ్ హుస్సేన్,హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి కానిస్టేబుల్ రాజ్ కుమార్ రమేష్,మారయ్య పాల్గొన్నారు



# పొంచి ఉన్న ప్రమాదం.. దారి మళ్లింపు

**పాలకుర్తి, నేడు న్యూస్:** జనగమ జిల్లా పాలకుర్తి మండల కేంద్రం నుండి కొడకండ్లకు వెళ్లే దారిలో వల్మీకి ముత్తారం మధ్యలో గల కల్వర్టు గతంలో కుంగిపోవడం వలన మట్టి పోశారు, భారీ వర్షాల కారణంగా అది పూర్తిగా కుంగిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పోలీస్ వారు ప్రమాదాల ను దృష్టిలో ఉంచుకొని దారి మళ్లింపు కార్యక్రమం చేపట్టారు. ఆ దారిలో వెళ్లే ప్రయాణికులందరూ గమనించగలరు. పోలీస్ శాఖను ప్రజలు అభినందిస్తున్నారు.



# పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ
- పీర్జాదిగూడ లోని శ్రీ చైతన్య బాలికల జూనియర్ కాలేజీ నుండి గ్లోబల్ స్కూల్ వరకు

**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** సమాజ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ శ్రీ చైతన్య మహిళా కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థులతో శ్రీ చైతన్య బాలికల జూనియర్ కాలేజీ నుండి గ్లోబల్ స్కూల్ వరకు క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందిని స్మరించి, వారికి గౌరవప్రధానమైన నివాళి సమర్పించారు. అనంతరం మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి మాట్లాడుతూ..పోలీస్ అమరవీరులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సమాజ రక్షణ కోసం చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. వారిని స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని చెప్పారు. విద్యార్థులు తొందరపడి చెడు నిర్ణయాలు తీసుకోవద్దు, ఏదైనా ఎదుర్కునే దైర్యం, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి, మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

## భారత్ వస్తోన్న రష్యా చమురు ట్యాంకర్

# సముద్రంలో యూటర్న్



**రష్యా :** ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో రష్యా నుంచి భారత్‌కు జరుగుతోన్న చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు కనిపిస్తోంది. ఆ దేశ ముడిచమురుతో భారత్ వైపు వస్తోన్న ట్యాంకర్ మార్గమధ్యలో యూటర్న్ తీసుకుంది. బాల్టిక్ సముద్రంలో నిలిచిపోయింది. డెన్మార్క్, జర్మనీ మధ్య ఉన్న జలసంధిలో పశ్చిమం వైపుగా వెళ్తున్న ఒక ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వెనక్కి మళ్లింది. కొంతదూరం వెళ్లిన తర్వాత నెమ్మదించిందని షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడించింది. ఇదిలాఉంటే.. ఈ ఆంక్షల నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మీమిత్తల్ రష్యా చమురును కొనుగోలు చేశారు. ఆర్సెలార్ మిత్తల్‌కు చెందిన ఎనర్జీ విభాగం ఆంక్షల పరిధిలో ఉన్న నౌకల ద్వారా ముడి చమురు కొనగోళ్లను చేపట్టింది. పంజాబ్‌లోని గురుగోవింద్ సింగ్ రిఫైనరీకి ఈ ఏడాది నాలుగు నౌకల్లో చమురు రవాణా జరిగినట్లు ఆంగ్ల పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. పంజాబ్‌లోని రిఫైనరీ మిత్తల్ ఎనర్జీ యాజమాన్యంలో నడుస్తోంది. ఇది దేశంలోనే పదో అతిపెద్ద రిఫైనరీ. ఒక ఏడాదికి 11.3 మిలియన్ టన్నుల ముడిచమురును ప్రాసెస్ చేస్తుంది. "జులై–సెప్టెంబర్ మధ్యలో ముర్మాన్స్క్‌లోని ఆర్కిటిక్ పోర్ట్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకు అమెరికా ఆంక్షల జాబితాలో ఉన్న నౌకల్లో చమురు రవాణా అయింది. అలాగే ఈ రవాణాను కప్పిపుచ్చుకునేందుకు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయి" అని మీడియా కథనం పేర్కొంది. షిప్పింగ్ డేటా, కస్టమ్స్ రికార్డ్స్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. ఈ నౌకల్లో రవాణాను ఎవరు ఏర్పాటుచేశారనేది మాత్రం తెలియదని వెల్లడించింది. ఈ రిఫైనరీ.. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మిత్తల్ గ్రూప్ భాగస్వామ్యంలో నడుస్తోంది. రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అగ్రరాజ్యం నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా, పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. గతంలోనూ రష్యాపై అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ.. ఈసారి వాటి తీవ్రత ఎక్కువగా ఉంది.

---

# భారత్ చేతిలో కీలుబొమ్మగా అఫ్గాన్

### పాక్ రక్షణ మంత్రి ఆరోపణలు



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ భారత్ లక్ష్యంగా చేసుకొని మరోసారి నోరుపారేసుకున్నారు. అఫ్గానిస్థాన్ భారత్ చేతిలో కీలుబొమ్మగా మారిందంటూ ఆరోపించారు. ఈసందర్భంగా ఇస్లామాబాద్‌పై దాడి జరిగితే.. దానికి 50 రెట్ల తీవ్రతతో ప్రతిదాడి తప్పదంటూ హెచ్చరికలు చేశారు. ఓ వార్తా సంస్థకు సంబంధించిన షోలో ఆయన మాట్లాడుతూ కాబూల్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. కాబూల్‌లోని ప్రజలను దిల్లీ నియంత్రిస్తోందన్నారు. భారత్ చేతిలో అఫ్గాన్ కీలుబొమ్మగా మారిందంటూ ఆరోపణలు చేశారు. భారత్ తన ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు ఆ దేశాన్ని ఉపయోగించుకుంటుందని వ్యాఖ్యానించారు. కాబూల్‌తో ఓ ఒప్పందానికి దగ్గరగా వెళ్లినప్పుడల్లా.. కొందరు జోక్యం వల్ల అది ఉపసంహరణకు గురవుతుందన్నారు. సరిహద్దుల్లో శాంతి కోసం చర్చలకు పిలుపునిచ్చిన అఫ్గాన్ ప్రతినిధి బృందాన్ని ఆయన ప్రశంసించారు. అయితే, భారత ప్రభావంతో దాని పురోగతి దెబ్బతిందని ఆరోపించారు. ఈసందర్భంగా సరిహద్దుల్లో ఘర్షణల నేపథ్యంలో అఫ్గాన్ బెదిరింపులపై ఆసిఫ్ స్పందించారు. తమ దేశంలో ఉగ్రవాదానికి ఆ దేశమే కారణమన్నారు. అఫ్గాన్‌తో చర్చలు విఫలమైతే.. అది ఆ దేశంతో పూర్తి యుద్ధానికి దారితీయొచ్చని ఆయన హెచ్చరించారు. కాబూల్‌ను భారత్ ఓ సాధనంగా ఉపయోగించుకుంటుందన్నారు.

### పాక్- అఫ్గాన్ శాంతి చర్చలు విఫలం..

పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఇటీవల ఇరుదేశాల మధ్య ఘర్షణలు నెలకొన్న సంగతి తెలిసిందే. వీటికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా తుర్కియేలో ఇరుదేశాల మధ్య పలు దశల్లో చర్చలు జరిగాయి. అయితే, తాజాగా అవి విఫలమయ్యాయి. చర్చల నేపథ్యంలో పలు అంశాలపై ఇరుదేశాల మధ్య అంగీకారం లభించిందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, సరిహద్దుల్లో దాడులకు కారణమైన ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు తాలిబన్ ప్రభుత్వం నిరాకరించిన నేపథ్యంలో ఇవి విఫలమయ్యాయని వెల్లడించా యి. పాక్ సమాచార మంత్రి అత్తావుల్లా తరార్ కూడా ఇలాం టి ఆరోపణలే చేశారు. పాక్– అఫ్గాన్ చర్చల్లో ప్రతిష్ఠంభన నెలకొందంటూ ఇరుదేశాల ప్రభుత్వ మీడియాల్లో పేర్కొన్న కొన్ని గంటల్లో ఇవి విఫలమయ్యాయి. చర్చలు విఫలమైన నేపథ్యంలో పాక్‌కు తాలిబన్ ప్రభుత్వం గట్టి హెచ్చరికలు చేసింది. భవిష్యత్తులో తమ భూభాగంపై ఎలాంటి దాడి జరిగినా.. ఇస్లామాబాద్ లక్ష్యంగా తమ ప్రతీకార చర్యలు తీవ్రంగా ఉంటాయని పేర్కొంది.

---



# తుఫాన్ ప్రభావంతో గొర్రెలు, మేకలు మృతి

**ఇనుగుర్తి, నేడు న్యూస్:** తుఫాన్ ప్రభావంతో గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని గొర్ల కాపరులు గొర్లు, మేకలను మేత కోసం అడవికి తీసుకు వెళ్లారు. బుధవారం మొంథా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు, భారీ వర్షం కురవడంతో వర్షం నీరు, చల్లటి గాలులకు తట్టుకోలేక 8 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. మండల కేంద్రానికి చెందిన పూజారి అశోక్ 2, గాడుదుల యాకన్న 2, కసరబోయిన వెంకన్న 3, కాడపోయిన వెంకన్న 1, గొర్రెలు మేకలు మృతి చెందాగా, మరికొన్ని విషమంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

---

# వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించండి

### ఇబ్బందులు ఎదురైతే ఫోన్ చేయండి : కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**పాలకుర్తి,నేడు న్యూస్:** జనగామ జిల్లాలో కొనసాగుతున్న వర్షాల నేపథ్యంలో... అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 24/7 పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌లి బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. భారీ వర్షాల వల్ల వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు కూలిపోవడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భంలో వెంటనే కంట్రోల్ రూమ్‌కు 9052308621 సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, సమస్యలు తక్షణమే తెలియజేసి అధికారులు వెంటనే చర్యలు తీసుకునే విధంగా సహకరించాలన్నారు.

---

# ఒక్కో ఉద్యోగానికి రూ.35 లక్షలు..

### వెలుగులోకి భారీ జాబ్ స్కామ్..

**తమిళనాడు :** తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాల నియా మకాల్లో భారీ కుంభకోణం బయటపడింది. రాష్ట్ర ము న్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25 –35లక్షల చొప్పున ముడు పులు తీసుకున్న ట్లు తెలిసింది. ఓ మనీలాండరింగ్ కేసు కు సంబంధించి ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ జాబ్ స్కామ్‌ను గుర్తించిన అధికారులు.. దీనిపై తమిళనాడు పోలీసు విభాగానికి తాజాగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఈ కుంభకోణం వెనక శక్తిమంతమైన రాజకీయ నాయకులు, ప్రముఖులు ఉన్నారని ఈడీ అధికారులు ఆరోపించినట్లు సమాచారం. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలోని అసిస్టెంట్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితర పోస్టుల కోసం 2024లో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించారు. దాదాపు 1.12 లక్షల మంది ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నియామక పరీక్ష నిర్వహించి 2,538 మందిని ఎంపిక చేశారు. ఈ ఏడాది ఆగస్టులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా వీరికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అయితే, ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఈడీ ఆరోపించింది. దాదాపు 150 మంది అభ్యర్థులకు అనుకూలంగా పరీక్షలో రిగ్గింగ్‌కు పాల్పడినట్లు పేర్కొంది. ఇందుకోసం ఆయా అభ్యర్థుల నుంచి రూ.25–35లక్షల చొప్పున లంచాలు తీసుకున్నట్లు తెలిపింది. దీని వెనక రాష్ట్రంలోని కీలక రాజకీయ నాయకులు, కొన్ని సంస్థలు ఉన్నట్లు ఆరోపించింది. దీనిపై దర్యాప్తు చేయాలని కోరుతూ తమిళనాడు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌కు ఈడీ లేఖ రాసింది. ఈ ఆరోపణలకు సంబంధించి 232 పేజీల ఆధారాలను సమర్పించింది. ఈ పరీక్ష నిర్వహించిన అన్నా యూనివర్సిటీపై దర్యాప్తు చేయాలని ఈడీ కోరినట్లు ఆ కథనం వెల్లడించింది. దీంతో ఈ వ్యవహారం కాస్తా రాజకీయ దుమారం రేపింది. ఈ కథనాన్ని ప్రముఖ నటుడు విజయ్ పార్టీ టీవీకే తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. అయితే, ఈ వార్తలపై తమిళనాడు ప్రభుత్వం గానీ.. సీఎం స్టాలిన్ గానీ ఇంతవరకూ స్పందించలేదు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ కుంభకోణం అంశం కీలకంగా మారనుంది.

# లాభాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీ య మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో సూచీలు రాణించాయి. భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం ఖరారు కానుందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలూ పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. ముఖ్యంగా మెటల్, ప్రైవేట్ బ్యాంకింగ్, ఎనర్జీ, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ ఇంట్రాడేలో 85 వేల మార్కు దాటగా.. నిఫ్టీ 26 వేల ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 84,663.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,628.16) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,105.83 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 368.97 పాయింట్ల లాభంతో 84,997.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 117.70 పాయింట్ల లాభంతో 26,053..90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.21గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్ ప్రధానంగా లాభపడ్డాయి. బీఈఎల్, ఎటెర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.48 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు మళ్లీ 4 వేల డాలర్ల ఎగువకు చేరింది. ప్రస్తుతం 4027 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

బిజినెస్

# ‘కంగారూ’ను జయిస్తేనే ఫైనల్‌కు..

**మహిళల ప్రపంచ కప్ ఆఖరి దశకు చేరుకుంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినా కాస్త అదృష్టం తోడవడంతో నాలుగో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. వర్షం అంతరాయంతో టోర్నీలో ఇతర జట్లకు సంబంధించిన చాలా మ్యాచ్‌లు రద్దు కాగా.. భారత్ ఏడు పాయింట్లతో నాకౌట్ దశకు క్వాలిఫై అయింది. కానీ, ఇక్కడితో సంబరపడొద్దు. అసలు సిసలు పరీక్ష ముందుంది. ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ చేరినా కప్పు కలను సాకారం చేసుకోలేకపోయిన టీమ్‌ఇండియా.. మూడోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లాలంటే ముందుగా ‘కంగారూ’ను జయించాలి.**



అక్టోబర్ 30న జరిగే రెండో సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను హర్మన్‌ప్రీత్ సేన అమీ తుమీ తేల్చుకోనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఓడించడం భారత్‌కు అంత తేలిక కాదు. ఇప్పటికే లీగ్ దశలో కంగారూలతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 330 పరుగులు చేసి నా లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఎల్లిస్ పెర్రీ, ఆష్లీన్ గార్డ్‌నర్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీలతో ఆ జట్టు బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. వీరంతా ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సత్తా ఉన్నవాళ్లే. సూపర్ ఫామ్‌లో ఉన్న ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ భారత్‌తో సెమీస్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇది భారత్‌కు ఉపశమనాన్ని ఇచ్చే అంశం. బౌలింగ్‌లో ప్రధానంగా అలానా కింగ్, అన్నాబెల్ సదర్లాండ్‌తో భారత్‌కు ముప్పుంది. సోఫీ మోలినెక్స్, ఆష్లీన్ గార్డ్‌నర్ కూడా బంతితో రాణిస్తే టీమ్‌ఇండియాకు ఇబ్బందులు తప్పవు. సెమీస్‌కు ముందు ఫామ్‌లో ఉన్న ప్రతీక రావల్ గాయంతో టోర్నీకి దూరమవడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ సింగ్, దీప్తి శర్మ, రిచా ఘోష్‌లతో పేపర్ మీద టీమ్‌ఇండియా బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తున్నా వీరు ఏ మేరకు రాణిస్తారనే దానిపైనే భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. క్రాంతి గౌడ్, శ్రీచరణి, దీప్తి, రేణుకా సింగ్ బంతితో మెరిస్తే ఆసీస్‌కు షాకిచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లడం ఖాయం! మహిళల క్రికెట్లో ఇప్పటిదాకా 12 వన్డే ప్రపంచకప్‌లు జరగ్గా.. భారత్ నాలుగుసార్లు సెమీస్‌కు చేరింది. ప్రస్తుతం జరుగుతోన్న 13వ ఎడిషన్‌లో భారత్ మరోసారి నాకౌట్ దశకు అర్హత సాధించగలిగింది. 1997లో ఆస్ట్రేలియా, 2005లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. 2005 లో కివీస్‌ని 40 పరుగుల తేడాతో మట్టికరిపించిన మిథాలి రాజ్ సేన.. తుది పోరులో ఆస్ట్రేలియా జోరు ముందు నిలవలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2017లో కప్పు గెలిచేందుకు భారత అమ్మాయిలకు మంచి అవకాశమే వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. సెమీస్‌లో భీకర ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో 9 పరుగుల తేడాతో ఓడి విశ్వవిజేతగా నిలిచే ఛాన్స్‌ను మిస్ చేసుకుంది. ఇప్పుడు టైటిల్‌కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచిన టీమ్‌ఇండియా.. సెమీస్‌లో ‘ఆస్ట్రేలియా’ గండాన్ని దాటితే.. ఫైనల్‌లో ఇంగ్లాండ్ లేదా సౌతాఫ్రికాతో తలపడుతుంది.




## మూడు మ్యాచులకు నితీశ్ కుమార్ దూరం

భారత ఆటగాళ్లకు గాయాల సమస్య మళ్లీ మొదలైంది. ఆస్ట్రేలియాతో చివరి వన్డే సందర్భంగా శ్రేయస్ అయ్యర్ తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు రెండో వన్డే సమయంలోనే తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో వైదొలిగాడు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలోనే నితీశ్ ఉన్నాడు. ఇంకా పూర్తిగా కోలుకోలేదని బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పుడు ఐదు టీ20ల సిరీస్‌లోని తొలి మూడు టీ20లకు దూరంగా ఉంటాడని బీసీసీఐ వెల్లడించింది. “నితీశ్ కుమార్ తొలి మూడు మ్యాచుల్లో ఆడటంలేదు. ఎడమ తొడ కండరాల నొప్పి నుంచి కోలుకుంటున్నాడు. అడిలైడ్‌లో నితీశ్ గాయంతో ఇబ్బంది పడ్డాడు. మెడ నొప్పితోపాటు ఇతర సమస్యలు ఉన్నాయని వైద్యుల దృష్టికి తీసుకొచ్చాడు. అతడిని నిరంతరం మా మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోంది” అని బీసీసీఐ పోస్టు పెట్టింది.

## శ్రేయస్‌కు శస్త్రచికిత్స జరగలేదు

### బీసీసీఐ కార్యదర్శి సైకియా



భారత ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌కు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. అతడి ప్లీహానికి గాయమవడంతో అంతర్గతంగా రక్తస్రావం జరిగింది. దీంతో అతడిని ఐసీయూలో చేర్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే, బీసీసీఐ మాత్రం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని వెల్లడించింది. శ్రేయస్‌కు శస్త్రచికిత్స జరిగిందని, కనీసం ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. తాజాగా శ్రేయస్ పరిస్థితిపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మరోసారి స్పందించా రు. శ్రేయస్ ఎలాంటి సర్జరీ చేయించుకోవడం లేదని.. భిన్నమైన వైద్య ప్రక్రియతో అంతర్గత రక్తస్రావం జరగకుండా చూసినట్లు వెల్లడించారు. “శ్రేయ స్ అయ్యర్ చాలా బాగున్నాడు. వైద్యులు అనుకున్న దానికంటే వేగంగా శ్రేయస్ రికవరీ అవుతున్నాడు. డాక్టర్ రిజ్వాన్‌తో నిరంతరం టచ్‌లోనే ఉన్నా. సిడ్నీ ఆసుపత్రిలోనే భారత జట్టు వైద్యుడు ఉన్నారు. పూర్తిగా కోలుకుని రావడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుందని అనుకుంటున్నాం. కానీ, శ్రేయస్ తీరును చూస్తే ఇంకాస్త ముందుగానే కోలుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. వైద్యులు కూడా శ్రేయస్ పరిస్థితి మెరుగుదలపై సంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికే అతడు తన రోజువారీ కార్యక్రమాలను చేసుకుంటున్నాడు. అతడి గాయం తీవ్రమైందే కావచ్చు కానీ ప్రమాదం నుంచి మాత్రం బయటపడ్డాడు. ఇప్పటికే ఐసీయూ నుంచి అతడిని సాధారణ రూమ్‌కు మార్చారు” అని సైకియా తెలిపారు.

## వన్డేల్లో నంబర్ 1 బ్యాటర్‌గా రోహిత్ శర్మ



ఆస్ట్రేలియాతో ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడిన రోహిత్ శర్మ అదరగొట్టాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ చేసిన అతడు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు సొంతం చేసుకున్నాడు. ఆ సిరీస్‌లో రోహిత్ ప్రదర్శనకు ఐసీసీ ర్యాంకుల్లో ఫలితం కనిపించింది. వన్డేల్లో టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు అక్కడ ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు కిందికి దిగజారి మూడో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అఫ్గానిస్థాన్ ప్లేయర్ ఇబ్రహీం జద్రాన్ (764) రెండో స్థానంలో ఉండగా.. శుభ్‌మన్ గిల్ (745), బాబర్ అజామ్ (739), విరాట్ కోహ్లీ (725) ఆ తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్‌తో మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసినప్పటికీ విరాట్ ఒక స్థానం పడిపోయాడు. అంతకుముందు రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడమే దీనికి కారణమని క్రికెట్ విశ్లేషకుల అంచనా. శ్రేయస్ అయ్యర్ (700) టాప్ -10లో కొనసాగుతున్నాడు. ఇక ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (589) ఏకంగా 23 స్థానాలను మెరుగుపర్చుకొని 25వ ర్యాంక్‌ను అందుకొన్నాడు.

**బౌలింగ్ విభాగంలో...**

బౌలింగ్ విభాగంలో టీమ్‌ఇండియా తరఫున కేవలం ఒక్కరు మాత్రమే ఉండటం గమనార్హం. అదీనూ కుల్‌దీప్ యాదవ్ (634) ఒక ప్లేస్‌ను కోల్పోయి ఏడో ర్యాంకులో నిలిచాడు. ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ (628) రెండు స్థానాలు పైకి ఎగబాకి 8వ ర్యాంకులో ఉన్నాడు. అఫ్గాన్ ఆటగాడు రషీద్ ఖాన్ (710) బౌలింగ్ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా (215) మాత్రమే ఉన్నాడు. అతడు ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో ఆడని సంగతి తెలిసిందే. అక్షర్ పటేల్ (208) రెండు స్థానాలను మెరుగుపర్చుకొని 12వ ర్యాంకులో నిలిచాడు. ఇందులోనూ అఫ్గాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్‌దే (334) టాప్ ర్యాంకర్.

# తొలి టీ20 వర్షార్పణం

## టీమ్‌ఇండియా.. ఆసీస్ మధ్య మ్యాచ్ రద్దు



**కాన్‌బెర్రా :** అయిదు టీ20 సిరీస్‌లో భాగంగా టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియా మధ్య బుధవారం కాన్‌బెర్రా వేదికగా తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్థాంతరంగా రద్దైంది. కేవలం 9.4 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. మొదట టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆట నిలిచి పోయే సమయానికి భారత్ 1 వికెట్ కోల్పోయి 97 పరుగులు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆది నుంచి దూకుడుగా ఆడే ప్రయత్నం చేసింది. ఓపెనర్‌గా వచ్చిన అభిషేక్ శర్మ తనకు దక్కిన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో (3.5) అతడు ఫీల్డర్ మీదుగా ఫోర్ కొట్టే ప్రయత్నంలో భాగంగా బంతిని గాల్లోకి లేపాడు. దాన్ని టిమ్‌డేవిడ్ ఒడిసి పట్టుకున్నాడు. దీంతో అభిషేక్ 19 పరుగులకు (14 బంతుల్లో, 4 ఫోర్లు) పెవిలియన్‌కు చేరాడు. దీంతో టీమ్‌ఇండియా తన తొలి వికెట్‌ను 35 పరుగుల వద్ద కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, గిల్‌తో కలిసి టీమ్‌ఇండియాను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 5 ఓవర్లు ముగిసిన తర్వాత వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. తర్వాత కాసేపటికి వాన ఆగిపోవడంతో మ్యాచ్ ప్రారంభమైంది. అయితే ఆటను 18 ఓవర్లకు కుదించారు. మ్యాచ్ తిరిగి ప్రారంభమైన తర్వాత కాసేపటికి.. సూర్యకుమార్ 18 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. జేవియర్ బ్రేట్‌లెట్ బౌలింగ్‌లో (7.3) అతడు ఇచ్చిన క్యాచ్‌ను జోష్ ఫిలిప్ పట్టుకోలేకపోయాడు. అనంతరం మరింత జాగ్రత్తగా ఆడిన.. గిల్, సూర్యకుమార్ యాదవ్ రెండో వికెట్‌కు 32 బంతుల్లోనే అర్ధశతక భాగస్వామ్యం నమోదు చేశారు. భారత బ్యాటర్లు ఇక గేర్లు మార్చి వేగంగా పరుగులు చేయాలని చూస్తున్న తరుణంలోనే 9.4 ఓవర్ల వద్ద వరుణుడు ఆటకు మరోసారి ఆటంకం కలిగించాడు. అప్పటికి టీమ్‌ఇండియా స్కోర్ 97/1గా ఉంది. రెండోసారి మ్యాచ్ ఆగడానికి ముందు నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో (9.3) సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన సిక్స్ బాదాడు. ఇది అతడికి టీ20ల్లో 150వ సిక్స్. అతడు 86 ఇన్నింగ్స్‌ల్లో, 1649 బంతులు ఎదుర్కొని ఈ ఘనతను సాధించాడు. తర్వాత ఆటను కొనసాగించే పరిస్థితులు లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను అర్థాంతరంగా ముగించారు.



## హొండా నుంచి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ..

**టోక్యో:** జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం హొండా మోటార్ తన నెక్స్ట్ జనరేషన్ ఎలక్ట్రిక్ వాహనం హొండా 0 ఎ(ఆల్ఫా)ను ఆవిష్కరించింది. జపాన్ మొబిలిటీ షో- 2025లో కంపెనీ ఈ కొత్త కాన్సెప్ట్ మోడల్‌ను ప్రదర్శించింది. 2027లో ఈ మోడల్‌ను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానుంది. ముఖ్యంగా జపాన్, భారత్‌లో విడుదలకు హొండా సన్నాహాలు చేస్తోంది. ఇదే జరిగితే భారత మార్కెట్లో ఈ కంపెనీ తీసుకొచ్చే తొలి బ్యాటరీ ఆధారిత ఎలక్ట్రిక్ వాహనం ఇదే కానుంది. 2050 నాటికి తమ ఉత్పత్తులు, సంస్థ కార్యకలాపాలన్నీ కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యమని హొండా మోటార్ కో లిమిటెడ్ డైరెక్టర్, ప్రెసిడెంట్, ప్రతినిధి తోషిహిరో మిబే తెలిపారు. ఎలక్ట్రిక్ రంగంలో మార్కెట్ పరిస్థితులు కొంత అనిశ్చితంగా ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో ఎలక్ట్రిక్ వాహనాల దిశగా తప్పనిసరిగా మార్పు చోటుచేసుకుంటుందని ఆయన అన్నారు. ‘రాబోయే ఎలక్ట్రిఫైడ్ యుగానికి అనుగుణంగా ఆకర్షణీయమైన ఎలక్ట్రిక్ వాహనాలను అందించేందుకు మేము సిద్ధమవుతున్నాం’ అని మిబే పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో సంస్థ హొండా 0 సలూన్, హొండా 0 ఎస్‌యూవీ మోడళ్లను పరిచయం చేసింది. ఇప్పుడు వీటికి అనుబంధంగా హొండా 0 సిరీస్‌లో హొండా 0 ఎను అందులో చేర్చింది. నెట్‌జీరో లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా తన వాహనాలకు ‘జీరో’తో పేర్లు పెడుతోంది. భారత మార్కెట్లో రాబోయే సంవత్సరాల్లో పలు ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రవేశపెట్టనున్నట్లు హొండా ఇప్పటికే ప్రకటించింది. 2050 నాటికి కార్బన్ న్యూట్రాలిటీ లక్ష్యాన్ని సాధించే దిశగా సంస్థ ముందుకెళ్తోంది.





## అమెజాన్ లేఆఫ్స్..

### భారత్‌లో 1000 మందిపై ఎఫెక్ట్

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ తన గ్లోబల్ లేఆఫలలో భాగంగా భారత్‌లో 800-1000 మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉంది. అమెజాన్ తన కార్పొరేట్ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 14,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా భారత్‌లోనూ ఆ మేర తొలగింపులు చేపట్టనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఫైనాన్స్, మార్కెటింగ్, మానవ వనరులు, టెక్ విభాగంలో ఈ తొలగింపులు ఉండొచ్చని పేర్కొన్నాయి. ఏఐపై వెచ్చించడాన్ని కంపెనీ వేగవంతం చేసిన నేపథ్యంలో ఉద్యోగులపై వ్యయాలను తగ్గించుకునే ఉద్దేశంతో అమెజాన్ 14 వేల కార్పొరేట్ ఉద్యోగాలను తొలగించాలని నిర్ణయించింది. తొలుత ఈ సంఖ్య 30 వేలు అంటూ వార్తలు వచ్చాయి. తొలగించిన ఉద్యోగులకు కంపెనీలోనే కొత్త ఉద్యోగావకాశాన్ని వెతుక్కునేందుకు 90 రోజుల సమయం ఇస్తామని వెల్లడించింది. కొత్త ఉద్యోగాన్ని వెతుక్కోని వారికి /ఈ సదుపాయాన్ని వాడుకోవడం ఇష్టం లేని వారికి సెవరెన్స్ పే, అవుట్ ప్లేస్‌మెంట్ సేవలు, ఆరోగ్య బీమా ప్రయోజనాల రూపేణా కంపెనీ నుంచి సహకారం అందుతుందని తెలిపింది. అమెజాన్ కార్పొరేట్ విభాగంలో 3,50,000 మంది పనిచేస్తున్నారు. ఇందులో సుమారు 4% మందిని తొలగించేందుకు తాజాగా అమెజాన్ నిర్ణయం తీసుకుంది.

**అప్పట్లో 500 మంది**

అమెజాన్ సీఈఓగా ఆండీ జస్సీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కంపెనీలో లేఆఫ్‌ల పర్వం కొనసాగుతున్నాయి. ముఖ్యంగా జనరేటివ్ ఏఐ వల్ల రాబోయే కొన్నేళ్లలో తమ కార్పొరేట్ సిబ్బంది సంఖ్య తగ్గొచ్చని ఆయనే స్వయంగా వెల్లడించారు. 2023 మార్చిలో గ్లోబల్‌గా 9,000 మందిని అమెజాన్ తొలగించింది. అక్కడికి రెండు నెలల తర్వాత మరో 18,000తో కలిపి మొత్తంగా ఆ ఏడాది 27 వేల మందిని ఉద్యోగాల నుంచి అమెజాన్ తప్పించింది. 2023లో చేపట్టిన 9 వేల మంది తొలగింపులో భాగంగా భారత్ నుంచి 500 మంది ఉద్యోగాలు కోల్పోయారు.




## ఫేస్‌బుక్ తరహాలో వాట్సప్‌లోనూ కవర్‌ఫొటో

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ వినియోగదారులకు మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఫేస్‌బుక్, లింక్డన్‌లో మాదిరిగా ప్రొఫైల్ కవర్ ఫొటో సెట్ చేసుకునే అవకాశం ఇవ్వడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు ఈ సదుపాయం వాట్సప్ బిజినెస్ అకౌంట్స్‌లో మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు సాధారణ వినియోగదారులందరికీ ఈ ఫీచర్ ఇవ్వాలని సంస్థ ప్రయత్నిస్తోంది. ప్రొఫైల్ కస్టమైజేషన్‌ను మరింత విస్తరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఈ ఫీచర్ అభివృద్ధి దశలో ఉంది. వినియోగదారులకు అందుబాటులోకి రావడానికి కొంత సమయం పట్టొచ్చని సమాచారం. ఈ కొత్త ఫీచర్‌తో వినియోగదారులు తమ ప్రొఫైల్ సెట్టింగ్స్ నుంచి ఒక ఫొటోను ఎంచుకుని కవర్ ఇమేజ్‌గా సెట్ చేసుకోవచ్చని వాబీటా తన బ్లాగ్ పోస్ట్‌లో తెలిపింది. ప్రొఫైల్ పేజీ పైభాగంలో ఈ ఫొటో కనిపిస్తుందని పేర్కొంది. ఈ ఫీచర్ ఫేస్‌బుక్, లింక్డిన్ ప్లాట్‌ఫాంల్లో కనిపించే కవర్ ఫొటో తరహాలో ఉంటుంది. అలాగే వాట్సప్ ఈ ఫీచర్‌కు ప్రత్యేకమైన ప్రైవసీ సెట్టింగ్‌ను కూడా ప్రవేశపెట్టనుంది. దీంతో కవర్ ఫొటోను ఎవరు చూడాలనేది నియంత్రించుకోవచ్చు. ప్రస్తుతం Everyone, My Contacts, Nobodyఆప్షన్లు టెస్టింగ్‌లో ఉన్నాయి. Everyoneను ఎంపిక చేసుకుంటే కవర్ ఫొటోను అందరూ చూడొచ్చు. My Contacts ఆప్షన్ ద్వారా మీ ఫోన్లోని కాంటాక్ట్లు మాత్రమే చూడగలరు. Nobody ఎంపిక చేసుకుంటే మీ కవర్ ఫొటో మీరు తప్ప ఎవరూ చూడలేరు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com